



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 29 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి గురువారం 3 అక్టోబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## నాగచైతన్య, సమంత విడాకులకు

# కేటీఆరే కారణం!

## హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసింది ఆయనే

- హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటు చేసింది కేటీఆరే అన్న సురేఖ
- కేటీఆర్ కు తల్లి, అక్క, చెల్లెలు లేరా? అని ప్రశ్న
- దుబాయ్ నుంచి తనపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఉద్దేశించి తెలంగాణ మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. హీరోయిన్ల జీవితాలతో ఆడుకోవడం కేటీఆర్ కు అలవాటేనని ఆమె అన్నారు. కేటీఆర్ డ్రగ్స్ కు అలవాటు పడ్డారని... హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటు చేసింది కూడా ఆయనే అని మండిపడ్డారు. వారికి డ్రగ్స్ అలవాటు చేశాక... వారి ఫోన్లను ట్యాప్ చేశారని అన్నారు. సమంత, నాగచైతన్య విడిపోవడానికి కూడా కేటీఆరే కారణమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈరోజు నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో కొండా సురేఖ పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ కు తల్లి, అక్క, చెల్లెలు లేరా? అని సురేఖ ప్రశ్నించారు. తనపై బీఆర్ఎస్ వాళ్లు ట్రోలింగ్ చేస్తున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని అడిగారు. మంత్రి సీతక్క, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అసభ్యకర పోస్టులు పెట్టినప్పుడు కూడా కేటీఆర్ మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మనసున్న మనిషిగా ఈ అంశంపై హరీశ్ రావు స్పందించారని అన్నారు.

బీఆర్ఎస్ లో తాను ఐదేళ్లు పని చేశానని... తన వ్యక్తిత్వం ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసని సురేఖ అన్నారు. ప్రభుత్వం తప్పు చేస్తే నిలదీయాలని... అంతేకానీ, వ్యక్తిత్వాలను చంపే ప్రయత్నం చేయకూడదని చెప్పారు. బీఆర్ఎస్ లో రాజకీయ విలువలు దిగజారి పోయాయని దుయ్యబట్టారు. దుబాయ్ నుంచి నాలుగు సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా తనపై నీచమైన పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేశామని చెప్పారు.

## అవధూత దత్తపీఠం ప్రపంచ పర్యాటక క్షేత్రంగా ఎదగాలి

**అవధూత దత్తపీఠంలో దత్తమండపం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి**

- అవధూత దత్తపీఠం ప్రపంచ పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్ష
- ఇదే ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రానికి సీఎంగా అయ్యే అవకాశం వచ్చిందన్న సీఎం
- ఈ క్షేత్రం ప్రజలందరికీ ఉపయోగపడాలని ఆకాంక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:**అవధూత దత్తపీఠం ప్రపంచ పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు సీఎం రేవంత్ రెడ్డి. హైదరాబాద్ దుండిగల్ లోని అవధూత దత్తపీఠంలో దత్తమండపం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం చీఫ్ గెస్టుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సచ్చిదానంద

వివరాలు 2లో..

## మూసీ బ్రిడ్జిపైనే చర్చిద్దాం రా

**కేటీఆర్ కు పీసీసీ చీఫ్ మహేష్ సవాల్**



**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ డెవలప్ మెంట్ ప్రాజెక్టుపై.. డీపీఆర్ ఇంకా రెడీ కాకుండా అవినీతి అంటూ కేటీఆర్ చేస్తున్న కామెంట్లపై విరుచుకుపడ్డారు టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. మూసీ నది ప్రక్షాళనలో ఒక్క రూపాయి తిన్నట్లు చూపి స్తావా.. మూసీపై ఉన్న పురానాపూల్ బ్రిడ్జిపై చర్చిద్దామా.. నేను నా మంత్రులతో వస్తా.. నువ్వు మీ పార్టీ వాళ్లతో వస్తావా అంటూ మాజీ మంత్రి కేటీఆర్ కు సవాల్ చేశారు పీసీసీ చీఫ్.

వివరాలు 2లో..

## మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు

**రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శ**

- ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య సయోధ్య ఉన్నట్లుగా కనిపించడం లేదన్న కేటీఆర్
- డబ్బు కోసమే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టారని విమర్శ
- హైడ్రాను నడిపిస్తోంది రేవంత్ రెడ్డి కాదు... రాహుల్ గాంధీయేనని విమర్శ



వివరాలు 2లో..

## తెలంగాణలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు !

**జపాన్‌లో బిజీబిజీగా భట్టి**



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. జపాన్ లో పర్యటిస్తున్న భట్టి విక్రమార్క ఎలక్ట్రికల్ ఉత్పత్తుల దిగ్గజ కంపెనీ తోషిబా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తోషిబా ఉత్పత్తుల సేవలను

వివరాలు 2లో..

## కొత్త రాజకీయ పార్టీని స్థాపించిన ప్రశాంత్ కిశోర్

- జన్ సురాజ్ పార్టీ పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేసిన ప్రశాంత్ కిశోర్
- పార్టీ రెండేళ్లుగా క్రియాశీలకంగా ఉన్నట్లు వెల్లడి
- కొత్త పార్టీ నాయకత్వం తన చేతుల్లో లేదన్న ప్రశాంత్ కిశోర్



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. 'జన్ సురాజ్ పార్టీ' పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ రెండేళ్లుగా క్రియాశీలకంగా ఉందని, ఎన్నికల సంఘం నుంచి ఆమోదం పొందినట్లు చెప్పారు. బీహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించామని, అయితే ఈ పార్టీ నాయకత్వం మాత్రం తన చేతుల్లో లేదన్నారు. రెండేళ్లుగా ఈ పార్టీ కోసం శ్రమించిన వారే నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. గత మూడు దశాబ్దాలుగా బీహార్ ప్రజలు ఆర్జేడీ లేదా జేడీయూ లేదా బీజేపీకి మాత్రమే ఓటు వేస్తున్నారని, ఇక ఈ సంప్రదాయం అంతం కావాలన్నారు. తమ పార్టీ రాజవంశానికి చెందినది ఏమీ కాదన్నారు. జన్ సూరజ్ పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిందని తెలిపారు.

## అనవసరంగా ఇరాన్‌కు వెళ్లొద్దు..

# హెచ్చరించిన కేంద్రం

- ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులు
- మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తత
- ఈ నేపథ్యంలోనే భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన
- ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా, హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియే హత్యలకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగింది. నిన్న రాత్రి ఇజ్రాయెల్‌పైకి ఏకంగా 200లకు పైగా క్షిపణులను ప్రయోగించింది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో, తాజాగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. భారత్ నుంచి ఎవరూ అనవసరంగా ఇరాన్‌కు వెళ్లొద్దని హెచ్చరించింది. పరిస్థితులు

వివరాలు 2లో..

## కొండా సురేఖపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేశా



- తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్న బీజేపీ ఎంపీ
- మహిళలపై ట్రోలింగ్‌ను తిప్పికొడతామని వెల్లడి
- హైడ్రాపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని ప్రభుత్వానికి సూచన

వివరాలు 2లో..

## 80వేల ఏండ్ల నాటి తోకచుక్క.. బెంగళూరు ఆకాశంలో అద్భుత దృశ్యాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎలక్ట్రానిక్ క్యాపిటల్‌బెంగళూరు సిటీ ఓ అద్భుత దృశ్యానికి సాక్ష్యంగా నిలిచింది. బెంగళూరు నగర ఆకాశ వీధుల్లో ఎన్నడూ చూడని అరుదైన దృశ్యాలు అక్కడి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశాయి. పింక్, గ్రీన్,ఎల్లో రంగులతో అందమైన కాంతిరేఖలు కనుల విందు చేశాయి. ఈ అరుదైన దృశ్యాలను చూసి బెంగళూరువాసులు ఎంజాయ్ చేశారు. అంతేకాదు తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ రేర్ సీన్స్‌కు సంబంధించి సోషల్‌మీడియాలో పెద్ద చర్చ జరుగుతోంది. నెటిజన్లు ఈ దృశ్యాలను నార్తర్న్ లైట్స్‌తో పోల్చారు. రాత్రిపూట ఆకాశంలో కనిపించే ప్రకాశవంతమైన

వివరాలు 2లో..



## కొండా సురేఖ క్షమాపణ చెప్పాలి

- కేటీఆర్‌పై సంచలన ఆరోపణలు చేసిన కొండా సురేఖ
- కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన మంత్రి
- మార్గరేట్ థాచర్ కోట్‌ను జతచేసిన హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి కొండా సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. కేటీఆర్ పట్ల కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందించారు. ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలను

వివరాలు 2లో..



## సందర్భాన్ని బట్టి సినిమా వాళ్లపై మాట్లాడాము

- ఎవరి వ్యక్తిగత జీవితం వాళ్లకు ఉంటుందన్న సీతక్క
- పనిగట్టుకొని తాము సినిమా వాళ్ల గురించి మాట్లాడలేదని వెల్లడి
- తాము సినిమా వాళ్లను ద్వేషించడం లేదని వ్యాఖ్య

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# ఆందోళన కలిగిస్తున్న సైబర్ స్లేవరీ..

సైబర్ స్లేవరీ.. భారతీయులను ఆందోళనకు గురి చేస్తోంది. సుమారు 30వేల మంది ఇండియన్స్ ఆచూకీ తెలియడం లేదు. వారంతా ఏమయ్యారు? ఎక్కడున్నారు? సురక్షితంగా ఉన్నారా? అన్న ప్రశ్నలు టెన్షన్ పెడుతున్నాయి. బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ అండర్ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డేటా ప్రకారం 73వేల 138 మంది భారతీయులు కాంబోడియా, థాయ్ ల్యాండ్, మయన్మార్, వియత్నాం దేశాలకు వెళ్లారు. వీరంతా జనవరి 2022 నుంచి మే 2024 మధ్య వెళ్లారు. విజిటర్ వీసాలపై అక్కడికి వెళ్లినట్లు అధికారులు తెలిపారు.వీరిలో 29వేల 466 మంది ఇంకా తిరిగి రావాల్సి ఉంది. ఈ వ్యక్తులలో సగానికి పైగా అంటే 17వేల 115 మంది.. 20 నుంచి 39 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. అందులోనూ పురుషులు (21,182) ఎక్కువ మంది ఉన్నారు. అలా వెళ్లిన వారి ఆచూకీ తెలియడం లేదు. దీంతో వారి బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ వారి క్షేమ సమాచారం తెలియక కంగారు పడుతున్నారు.హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ సమాచారం ప్రకారం.. అచూకీ లేని భారతీయుల్లో మూడింట ఒక వంతు మంది పంజాబ్, మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన వారే. 20,450 మంది వ్యక్తులు తప్పిపోయినట్లు నివేదించబడిన ఈ కేసులలో 69 శాతానికి పైగా థాయ్‌లాండ్ మాత్రమే కారణమైంది.అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఇదంతా పక్కా ప్లానింగ్ తో జరుగుతోంది. భారీ జీతాలతో కూడిన ఉద్యోగాలు ఇస్తామని కొన్ని సంస్థలు ఊరిస్తున్నాయి. ఆ ప్రకటనలు చూసి భారతీయులు ఆగ్నేయ ఆసియా దేశాలకు అట్రాక్ట్ అవుతున్నారు. కట్ చేస్తే అదో ఘరానా మోసం అని తెలుస్తోంది. అదొక ట్రాప్. అలా వెళ్లిన వారిని సైబర్ బానిసలుగా మార్చేస్తారు. బాధితులతో సైబర్ మోసాలు, ఇతర చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు చేయిస్తారు. వాళ్లు చెప్పినట్లు వినకపోతే టార్చర్ పెడతారు. చంపడానికి కూడా వెనకాడరు అని అధికారులు చెబుతున్నారు.ఈ వ్యవహారాన్ని కేంద్రం సీరియస్ గా తీసుకుంది. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ఉన్నత స్థాయి అంతర్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. మేలో ఏర్పాటైన ఈ ప్యానెల్.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సమగ్రమైన గ్రౌండ్-లెవల్ వెరిఫికేషన్ నిర్వహించి తప్పిపోయిన వ్యక్తుల వివరాలను సేకరించాలని ఆదేశాలు ఇచ్చింది. అంతేకాదు.. బాధితులు దేశం విడిచి వెళ్లే ముందు వారిని గుర్తించే యంత్రాంగాన్ని మెరుగుపరచాలని ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌ని టాస్క్ ఫోర్స్ కోరింది.భారత్ నుంచి సౌత్ ఈస్ట్ ఆసియా దేశాలకు వెళ్లి తిరిగిరాని వ్యక్తుల్లో ఎక్కువగా.. పంజాబ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత..ఉత్తరప్రదేశ్ (2,946),కేరళ (2,659),ఢిల్లీ (2,140),గుజరాత్ (2,068),హర్యానా (1,928).కర్నాటక, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది తిరిగి రావాల్సి ఉంది. వెస్ట్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల నుండి ఆ సంఖ్య తక్కువగానే ఉంది.ఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచి వెళ్లిన 12వేల 493 మంది ఆచూకీ తెలియడం లేదు. ఆ తర్వాత ముంబై ఎయిర్ పోర్టు (4,699), కోల్ కతా ఎయిర్ పోర్టు (2,395), కొచ్చి ఎయిర్ పోర్టు నుంచి వెళ్లిన వారిలో (2,296) తిరిగి రాలేదు.ఒక్క కాంబోడియా దేశంలోనే 5వేల మందికి పైగా భారతీయులు చిక్కుకుపోయారనే వార్తలు ఆందోళను గురి చేస్తున్నాయి. బాధితులతో బలవంతంగా సైబర్ మోసాలు చేయిస్తున్నట్లు సమాచారం. రతీయ మీడియా నివేదికల ప్రకారం, వివిధ రాష్ట్రాలకు చెందిన వారి 20 మరియు 30 సంవత్సరాల వయస్సు గల భారతీయులను డేటా ఎంట్రీ ఉద్యోగాల కోసం సైబర్ నేరగాళ్లు ఆకర్షిస్తున్నారు. వారు కంబోడియా మరియు లావోస్ వంటి దేశాలలో దిగిన తర్వాత, వారి పాస్‌పోర్ట్‌లను ఈ కంపెనీలు తీసివేస్తాయి మరియు తరువాత వారు సైబర్‌ఫ్రాడ్ కాల్‌లు చేయవలసి వస్తుంది, ప్రధానంగా స్వదేశానికి తిరిగి వచ్చిన భారతీయులను లక్ష్యంగా చేసుకుంటారు. ఈ కాల్‌లలో చాలా వరకు ఆన్‌లైన్‌లో హనీ ట్రాపింగ్‌తో సమానం. మహిళలకు సంబంధించిన నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌లను సృష్టించమని స్కామర్లు భారతీయులను అడుగుతారు. మోసాలు క్రిప్టోకరెన్సీ పెట్టుబడుల నుండి డేటింగ్ వరకు ఉంటాయి.డేటా ఎంట్రీ జాబ్స్ పేరుతో భారతీయులను విదేశాలకు పంపి.. అక్కడికి వెళ్లాక వారితో సైబర్ మోసాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు చేయిస్తారని అధికారుల విచారణలో బయటపడింది. ఇటువంటి వ్యూహాల గురించి నెటిజన్లందరూ తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అప్రమత్తంగా ఉండటం మరియు ప్రామాణికమైన మూలాల నుండి వివరాలను క్రాస్-వెరిఫై చేయడం ద్వారా, నెటిజన్లు తమ ప్రాణాలను కూడా అపాయం కలిగించే అటువంటి తీవ్రమైన బెదిరింపుల నుండి తమను తాము రక్షించుకోవచ్చు, ఒకసారి వారు అక్రమ రవాణాకు గురైనప్పుడు వారిని ఆంక్షలు విధించారు. సైబర్ హ్యూమన్ ట్రాఫికింగ్ లేదా సైబర్ బానిసత్వం బాధితులను రక్షించేందుకు భారత ప్రభుత్వం మరియు దాని ఏజెన్సీలు నిరంతరం ప్రయత్నాలు చేస్తుండటం గమనించదగ్గ వాస్తవం, బాధితులను రక్షించడానికి ప్రత్యేక ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక కార్యకలాపాలను నిర్వహించడానికి వారు మరింత పటిష్టమైన యంత్రాంగాలను అభివృద్ధి చేయాలి.

# మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు సయోధ్య ఉన్నట్లుగా కనిపించడం లేదని, కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు ఈ సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ... కేవలం డబ్బు కోసమే మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ఈ ప్రభుత్వం చేపట్టిందని ఆరోపించారు. బుల్డోజర్ ప్రభుత్వంతో తెలంగాణ ప్రజలు ఇబ్బంది పడుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారు? అని ప్రశ్నించారు.
హైడ్రాను నడిపిస్తోంది రేవంత్ రెడ్డి కాదని, రాహుల్ గాంధీ దీని వెనుక ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ వెనుక ఉండి పేదల పైకి బుల్డోజర్ పంపిస్తున్నారని మండిపడ్డారు. నోట్ల కట్టల కోసం చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల కష్టాలు పట్టవా? అని నిలదీశారు.ఇది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, లూటిఫికేషన్ అని చురక అంటించారు. మూసీ ప్రాజెక్టుపై కనీసం ప్రాజెక్టు రిపోర్టు కూడా లేదన్నారు. సుందరీకరణ కోసం డబ్బు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలన్నారు. ఈ అంశంపై రెండు మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానన్నారు.

## మూసీ బ్రిడ్జిపైనే చర్చిద్దాం రా

- మొదటి పేజీ తరువాయి
హైడ్రా, మూసీ.. రాహుల్ గాంధీకి లింక్ ఏంటని ప్రశ్నించారు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. చెరువులను కుంటలను ప్రొటెక్ట్ చేయడమే హైడ్రా ముఖ్య టాస్క్ అని అన్నారు. 16 వందల చెరువులను బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలోనే ఆక్రమణలకు యథేచ్ఛగా అనుమతులు ఇచ్చారని చెప్పారు. ఆరు నెలలుగా మీ నాయనా ఎక్కడ దాక్కున్నాడో తమకు అనుమానాలున్నాయన్నారు. మూసి ప్రక్షాళనలో ఒక్క రూపాయి తాము తిన్నట్టైతే .. పురాణపుల్ బ్రిడ్జి మీద మా మంత్రులతో వస్తాం. కేటీఆర్ నువ్ రా.. తిన్నది నిజమైతే మూసిలో నేను దూకుతా లేదంటే నువ్వు దూకు. డీపీఆర్ కాక ముందే లక్ష కోట్లు అంటూ కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. మూసి ప్రక్షాళన తెరమీదకు తెచ్చింది 2016లో నగరాన్ని అదుకుంటా అన్నోడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. మూసి బాధితులందరిని గుర్తించి పునరావాసం
కల్పిస్తామన్నారు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. బీఆర్ఎస్ నాయకులు మూసి నిర్వాసితులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ తో పోల్చితే హరీష్ రావుకు మానవత్వం ఉందన్నారు. కొండా సురేఖ సోషల్ మీడియా పోస్ట్ పై కనీసం కేటీఆర్ స్పదించలేదన్నారు. హరీష్ రావు కొండా సురేఖకు మద్దతుగా ట్వీట్ చేశారని తెలిపారు.

## తెలంగాణలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు ! జపాన్‌లో బిజీబిజీగా భట్టి

- మొదటి పేజీ తరువాయి
వారు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి.. హైదరాబాద్ లో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ వినియోగం ఎక్కువగా ఉంటుందని.. రాష్ట్రంలో సంబంధిత యూనిట్ లను ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే ఆధునిక జనరేటర్లు, విద్యుత్ పొదుపు నిల్వ ఉత్పత్తులు, విద్యుత్ వాహనాల బ్యాటరీలు, సంబంధిత సేవలు తెలంగాణలో అవసరమై ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెట్టుబడులతో తరలి రావాలని ఆయన సూచించారు. తెలంగాణను ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఎలక్ట్రికల్ వెహికల్స్ కి అగ్రస్థానం ఉంటుందన్నారు భట్టి. రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సులు అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా రూపుదిద్దాలని భావిస్తున్నామని, ఈ నేపథ్యంలో తోషిబా సేవలు అవసరమవుతాయన్నారు. అలాగే సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా బొగ్గుతో పాటు లిథియం వంటి ఇతర ఖనిజ తవ్వకాలలోనికి ప్రవేశించనున్నంని.. లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణితో కలిసి ముందుకు పోవచ్చని సూచించారు.

**తోషిబా ఉత్పత్తుల కేంద్ర సందర్శన**

ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు సమీపంలోని తోషిబా ఫ్యూయల్ సెల్ తయారీ యూనిట్ ను సందర్శించారు. న్యూక్లియర్ పవర్, థర్మల్ పవర్ ఉత్పత్తిలో వినియోగించే టర్బైన్లు, జనరేటర్ల తయారీ యూనిట్ ని పరిశీలించారు. ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్, ఇతర బ్యాటరీల తయారీ విధానాన్ని పరిశీలించారు.

**తెలంగాణలో తోషిబాను మరింతగా విస్తరిస్తాం**

భారత్ లో కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే తాము తమ యూనిట్లను ప్రారంభించామని తోషిబా అధికారులు వెల్లడించారు. దీనిలో తెలంగాణ ప్రముఖమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ఎంతో అనుకూలంగా ఉన్నందున స్వయంగా కానీ రాష్ట్ర ప్రభుత్వంతో ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ ఇక్కడ తమ పరిశ్రమలను విస్తరించేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుత ఈవీ వెహికల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచుతామని, ప్లాంట్ విస్తరణకు ప్రయత్నిస్తామని తోషిబా అధికారులు తెలిపారు.

**ప్రజా రవాణాలో జపాన్ బుల్లెట్ ట్రైన్ ప్రపంచానికే ఆదర్శం: భట్టి**

ప్రజా రవాణా వ్యవస్థలో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని శ్రీ భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. టోక్యో నగరం నుంచి ఆయన బుల్లెట్ ట్రైన్ లో మధ్యాహ్నం ఒసాకా పట్టణానికి బయలుదేరారు. 700 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గాన్ని కేవలం కేవలం 2 గంటల 20 నిమిషాలలో బుల్లెట్ ట్రైన్ ద్వారా చేరుకున్నారు. ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా సాగిందని, ట్రైన్ లో సౌకర్యాలు ఎంతో బాగున్నాయని ఈ తరహా రవాణా వ్యవస్థను తెలంగాణలో కూడా అభివృద్ధి పరచడానికి పూనుకోవాలని రైల్వే శాఖను కోరనున్నట్లు శ్రీ భట్టి పేర్కొన్నారు.

## 80వేల ఏండ్ల నాటి తోకచుక్క.. బెంగళూరు ఆకాశంలో అద్భుత దృశ్యాలు..

- మొదటి పేజీ తరువాయి
స్విర్లింగ్ కర్టెన్లు అని అరోరా బొరియాలిస్ అని పిలుస్తారని అంటున్నారు. మరొకొందరు అరుదైన తోకచుక్క అని రాశారు. వాస్తవానికి ఇది ఒక సి/2023ఎ3 అనే అరుదైన తోక చుక్క విన్యాసం అని ఖగోళ ఫోటోగ్రాఫర్లు చెబుతున్నారు. ఇది మనకు ఎప్పుడు కనిపించే హేలీ తోక చుక్క వలె కాకుండా దాని రూపాన్ని అరుదైనదని.. బెంగుళూరు ఆకాశంలో కనిపించి కనుల విందు చేసిందని చెబుతున్నారు. దీనిని Tsuchinshan-ATLAS అని కూడా పిలుస్తారు. 80వేల ఏండ్ల తర్వాత సౌర వ్యవస్థలో ప్రవేశించిన తోకచుక్క అని చెబుతున్నారు. సేమ్ టు సేమ ఇలాంటి దృశ్యాలే జనవరి 9, 2023లో చైనాలో కూడా కనిపించాయి. పర్పుల్‌మౌంటెన్ అబ్జర్వేటరీ అనే ఖగోళ శాస్త్ర ప్రయోగశాల ఈ దృగ్విషయాన్ని కనిపెట్టింది. జనవరి 9, 2023న చైనాలోని పర్పుల్ మౌంటైన్ అబ్జర్వేటరీ ఈ తోకచుక్కను కనుగొంది. సరిగ్గా ఒక నెల తర్వాత దక్షిణాఫ్రికాలోని ఆస్టరాయిడ్ టెరెస్ట్రియల్-ఇంపాక్ట్ లాస్ట్ అలెర్ట్ సిస్టమ్ ద్వారా ఈ తోకచుక్కను మరోసారి చూడగలిగారు.

## సందర్భాన్ని బట్టి సినిమా వాళ్లపై మాట్లాడాము

పెన్ పవర్ డెస్క్:పనిగట్టుకొని తాము సినిమా వాళ్ల గురించి మాట్లాడలేదని, ఎవరి వ్యక్తిగత జీవితం వాళ్లకు ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. సందర్భాన్ని బట్టి కొంతమంది సినిమా ప్రముఖులపై మాత్రమే కొండా సురేఖ మాట్లాడారన్నారు. సినీ నటులకు తాము వ్యతిరేకం కాదన్నారు. వాళ్లను తాము ద్వేషించడం లేదన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ... గతంలోని మహిళా మంత్రుల చరిత్ర, ఇప్పటి మహిళా మంత్రుల చరిత్ర అందరికీ తెలుసునన్నారు. తాము ప్రజల చేత ఎన్నుకోబడిన మంత్రులం అన్నారు.ప్రజల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ప్లాట్లుగా మార్చి అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అన్నారు. కేటీఆర్ చాటుగా మాట్లాడటం కాదని, నేరుగా వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు. పండగపూట అనవసరంగా తమను విమర్శించవద్దని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. తాను, కొండా సురేఖ... సమ్మక్క, సారలమ్మ, రాణి రుద్రమదేవి ప్రాంతాల నుంచి వచ్చామన్నారు.
ప్రజలు వరదలతో ఇబ్బందిపడవద్దని ప్రభుత్వం ప్రక్షాళనను ప్రారంభించిందన్నారు. మూసీ కూల్చివేతల అంశంలో పేదలకు నష్టం జరగకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మూసీ ప్రక్షాళన విషయంలో తమను అసభ్యకరంగా దూషించి, శిఖండి అని ఎలా అంటారని నిలదీశారు.

## అవధూత దత్తపీఠం ప్రపంచ పర్యాటక క్షేత్రంగా ఎదగాలి

- మొదటి పేజీ తరువాయి
స్వామీజీ, మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అటెండ్ అయ్యారు. ఈ సందర్భంగా రేవంత్.. అవధూత దత్తపీఠం ప్రపంచ పర్యాటక క్షేత్రంగా ఎదగాలని అన్నారు. మైసూర్ లో నిర్వహించాల్సిన కార్యక్రమం దుండిగల్లో నిర్వహించడం గొప్ప నిర్ణయమన్నారు.

## అనవసరంగా ఇరాన్‌కు వెళ్లొద్దు.. హెచ్చరించిన కేంద్రం

- మొదటి పేజీ తరువాయి
చక్కబడే వరకు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు మానుకోవాలని భారతీయ పౌరులకు సూచించింది.అక్కడి భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నామని, ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఏదైనా అత్యవసరమైతే టెహ్రాన్‌లోని భారత ఎంబసీని సంప్రదించాలని తెలిపింది.

## కొండా సురేఖపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేశా

**పెన్ పవర్ డెస్క్:**మంత్రి కొండా సురేఖపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్ రావు వెల్లడించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై వస్తున్న ట్రోలింగ్‌ను తిప్పికొడతామన్నారు.తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలను అవమానించడం సరైన పద్ధతి కాదన్నారు. మంత్రిపై తప్పుడు పోస్టులు పెట్టిన వారు ఎంత పెద్దవారైనా శిక్షపడేలా చేస్తామన్నారు.హైడ్రా నిబంధనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అఖిలపక్ష భేటీకి అన్ని పార్టీలను ఆహ్వానించాలన్నారు. హైడ్రాపై కొంతమంది అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా బుల్డోజర్‌లతో కూల్చిన విషయాన్ని మరిచినట్లున్నారని చురక అంటించారు.

## కొండా సురేఖ క్షమాపణ చెప్పాలి

- మొదటి పేజీ తరువాయి
ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ వాదనల్లో పసలేకే వ్యక్తిగత దూషణలకు దిగుతారన్న మార్గరెట్ థాచర్ కోట్‌ను పోస్టుతో జతపరిచారు.కొండా సురేఖపై జరిగిన ట్రోలింగ్‌ను ఒక మహిళగా తాము ఖండించామని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. కానీ బాధ్యతగల మంత్రిగా దిగజారి ఆమె మాట్లాడటం సరికాదన్నారు. సినిమా పరిశ్రమలో ఉన్న మహిళలపై చేసిన వ్యాఖ్యలు తీవ్రమైనవి అన్నారు. ఒక మహిళగా మరో మహిళను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. తనపై ఎవరో ట్రోల్ చేస్తే కేటీఆర్‌కు ఆపాదించడం, వ్యక్తిగతంగా దూషించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమను కామెంట్ చేసిన విషయం కొండా సురేఖ మరిచారా? అని ప్రశ్నించారు.

## ఢిల్లీలో రూ.2వేలకోట్ల విలువైన కొకైన్ సీజ్!

**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని నగరం ఢిల్లీలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం కలకలం సృష్టించింది. ఓ అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లింగ్ ముఠా నుంచి ఒకటికాదు రెండుకాదు ఏకంగా 500 కిలోల కొకైన్‌ను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
ఈ డ్రగ్స్ విలువ రూ. 2వేలకోట్లకుపైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో పోలీస్ స్పెషల్ సెల్ బృందం దక్షిణ ఢిల్లీలో సోదాలు చేపట్టింది.
ఈ తనిఖీల్లో నలుగురు వ్యక్తులను నుంచి 560 కిలోలకుపైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో ఈ మాదక ద్రవ్యాల విలువ రూ. 2వేలకోట్లకు పైగా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం పోలీసులు నిందితులను విచారిస్తున్నారు. కాగా, ఇటీవల ఢిల్లీ పోలీసులు ఇద్దరు ఆఫ్ఘనిస్థాన్ పౌరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని విచారించగా.. భారీగా డ్రగ్స్ దందా నడిపిస్తున్న ఈ అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయ్యిందని పోలీసులు తెలిపారు.

# లీగల్ పాలిటిక్స్....




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ పాలిటిక్స్‌లో కొత్త ట్రెండ్.. ఎప్పుడూ చూడని ట్రెండే.. అదేంటంటే.. ఏకవచన సంబోధనలు, వ్యక్తిగత ఆరోపణలకుదాకా వెళ్లే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త ఒరవడి కనిపిస్తోంది. మాటకు మాటతో సరిపోవడం లేదు. కౌంటర్‌కి రివర్స్ కౌంటర్ ఇస్తే చాలడం లేదు. ఎన్ని చెప్పుకున్నా ఎంత తిట్టుకున్నా సంతృప్తి చెందడం లేదు. అంతకుమించి అన్నట్లు.. లీగల్ నోటీసులతో ప్రత్యర్థులు, ఆరోపణలు చేసినవాళ్లను కోర్టుకీడ్చాలనుకుంటున్నారు నేతలు. కొన్నివారాల వ్యవధిలోనే ఇద్దరి లీగల్ నోటీసులతో స్టేట్ పాలిటిక్స్‌లో ఇప్పుడు దీనిపైనే చర్చ.కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కి లీగల్ నోటీసు ఇచ్చారు బీఆర్ఎస్‌కి చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు. అవాస్తవ ఆరోపణలతో తన పరువుకు భంగం కలిగించారని న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు హరీశ్‌రావు. ఎప్పట్నించో రాజకీయాల్లో ఉన్న హరీశ్‌రావుకు ఆరోపణలు, సవాళ్లు కొత్తకాకపోయినా.. ఈసారి కౌంటర్‌తో సరిపెట్టకుండా కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీస్ కూడా పంపారు. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలతో పాటు మూసీ ప్రక్షాళన.. రాజకీయాలను షేక్ చేస్తోంది. ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడుతున్నాయి విపక్షపార్టీలు. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు ముఖ్యనేతలు బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఇదే సమయంలో హరీశ్‌రావుపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు.హిమాయత్ సాగర్ ఈఓ పరిధిలో ఉన్న ఆనంద్ కన్వెన్షన్‌లో హరీశ్‌కి వాటాలున్నాయని ఆరోపించారు ఎంపీ అనిల్ కుమార్. మూసీ పర్యటన పేరుతో రాజకీయ డ్రామాలు ఎందుకో తెలుసా.. హిమాయత్‌సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో కట్టిన కన్వెన్షన్‌లో హరీశ్ రావుకు వాటాలున్నాయని సంచలన ట్వీట్ చేశారు అనిల్. కన్వెన్షన్‌ని కాపాడుకునేందుకే హరీశ్ డ్రామాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. ఆస్తులను కాపాడుకునేందుకు సామాన్య ప్రజలను అడ్డుపెట్టుకుంటున్న అగ్గిపెట్టె హరీశ్.. ఖబర్దార్ అంటూ ఘాటుగా ట్వీట్ చేశారు అనిల్ కుమార్ యాదవ్. అనిల్ కుమార్ యాదవ్ ట్వీట్‌కి అదేస్థాయిలో కౌంటర్ ఇచ్చారు హరీశ్‌రావు కూడా.ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై బురదజల్లే వికృత రాజకీయాలకి కాంగ్రెస్ తెరలేపిందని హరీశ్‌రావు రియాక్టయ్యారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాల్ని ఆశ్రయిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. రేపు గోల్కొండ కోట, చార్మినార్‌లో కూడా వాటాలు ఉన్నాయంటారేమో.. అబద్దపు ప్రచారాలు చేస్తున్నందుకు లీగల్ నోటీస్ పంపుతున్నానని స్పందించారు. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావాకి రెడీగా ఉండాలని అనిల్ కుమార్ యాదవ్‌ని హెచ్చరించారు. దానిపై కూడా కాంగ్రెస్ ఎంపీ తనదైన శైలిలో మరో ట్వీట్ చేశారు. ఆరోపణలపై వివరణ మాత్రం ఇవ్వలేదంటూ.. నిప్పు లేనిదే పొగ రాదనుకోవాలా అంటూ మరో ట్వీట్ వదిలారు అనిల్‌కుమార్ యాదవ్.ఈ ఎపిసోడ్‌కి కొన్నాళ్లముందే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి లీగల్ నోటీస్ పంపారు సృజన్‌రెడ్డి. ఆయన మరెవరో కాదు సీఎం రేవంత్‌రెడ్డికి బావమరిది వరస. అమృత్ పథకం టెండర్ల విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి లీగల్ నోటీసులిచ్చారు సృజన్‌రెడ్డి. తనపై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పట్టణాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం కుటుంబసభ్యులు అవినీతికి పాల్పడ్డారని కేటీఆర్ చేసిన ఆరోపణలు దీనికి కారణమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి తన అధికారాన్ని ఉపయోగించి బావమరిది సృజన్ రెడ్డికి పనులు అప్పగించారని తీవ్ర ఆరోపణలు చేశారు కేటీఆర్.సీఎం కుటుంబాన్ని కేటీఆర్ టార్గెట్ చేసుకోవడటంతో కాంగ్రెస్ కీలకనేతలంతా స్పందించారు. మంత్రి పొంగులేటి ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కూడా తన అల్లుడు సృజన్‌రెడ్డికి నిబంధనల ప్రకారమే టెండర్ దక్కిందని వివరణ ఇచ్చారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో సీఎం సెంట్రిక్‌గా బీఆర్ఎస్ ఆరోపణలు చేయటంతో.. కేటీఆర్‌కి లీగల్ నోటీసులు ఇచ్చారు సృజన్‌రెడ్డి. ఈ లీగల్ నోటీసులకు అటు కేటీఆర్, ఇటు అనిల్‌కుమార్‌యాదవ్ ఇద్దరూ ఇప్పటికైతే ఎలాంటి సారీ చెప్పలేదు. చెప్పే మూడ్‌లో కూడా లేరు. కోర్టుదాకా వస్తే ఎవరి రియాక్షన్ ఎలా ఉంటుందన్నదే తెలంగాణ పాలిటిక్స్‌లో ఇప్పుడు హాట్‌టాపిక్..

## మరో రైతు ఆత్మహత్య....

**వరంగల్, అక్టోబరు 2, పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు ఇచ్చింది. వాటిల్లో రైతు రుణమాఫీ ప్రధానమైంది. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. చాలామందికి రుణమాఫీ అయ్యింది. కానీ.. రుణమాఫీ కానివారు ఇంకా ఉన్నారు. వారు అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారు. రుణమాఫీపై అశలు వదులుకుంటున్నారు. కొంతమంది రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు.తాజాగా.. రుణమాఫీ కాలేదని, ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ధారావతు తండాలో జరిగింది. తండాకు చెందిన ధారావతు రవి(53) అనే రైతు ఆర్థిక ఇబ్బందులు, రుణమాఫీ కాలేదనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ తండాలో విషాదం నెలకొంది.రోజూలానే రవి పొలానికి వెళ్లాడు. కానీ.. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య.. భర్తను వెతుక్కుంటూ వెళ్లింది. ఆమెకు గుండెలు బరువెక్కే దృశ్యం కనిపించింది. పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు తన భర్త. కేకలు వేస్తూ.. వెంటనే స్థానికులకు సమాచారం ఇచ్చింది. స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. రవి, అతని భార్య పేరిట బ్యాంకులో రూ.2,46,000 రుణం ఉంది. అది మాఫీ కాకపోవడంతో పాటు.. ఇతర అప్పులు ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడని తండా వాసులు చెబుతున్నారు. రుణమాఫీ అయితే.. ఇప్పుడు వచ్చే పంటతో అప్పులు తీర్చేసి.. సంతోషంగా వ్యవసాయం చేసుకుంటానని రవి చెప్పినట్టు తోటి రైతులు చెబుతున్నారు.మూడు విడతల్లోనూ రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు సేకరించారు. రేషన్ కార్డు లేకపోవడంతో 4 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని గుర్తించారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ల పేర్లలో తప్పుల వల్ల మరో 1.50 లక్షల మందికి రుణమాఫీ కాలేదని నిర్ధారించారు. మొత్తం 5 లక్షలకు పైగా అర్హుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆమోదం తెలపగానే వీరందరికీ రుణమాఫీ రూ.5 వేల కోట్లు అకౌంట్లలో జమ అవ్వనుంది

## రివర్, లేక్ వ్యూ పోయో...రోడ్ వ్యూ వచ్చే...

**హైదరాబాద్, అక్టోబరు 2, పెన్ పవర్:** ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఉంటుంది. ఆ కల నెరవేర్చుకొనేందుకు పైసా పైసా కూడబెట్టుకుంటారు అందరూ. అలాగే బ్యాంక్ లోన్స్, ఇతర ప్రైవేట్ లోన్స్ తీసుకొని ఇళ్లు నిర్మించుకోవడం, కొనుగోలు చేయడం అనేది ప్రస్తుతం ప్రతీ కుటుంబంలో జరుగుతోంది. అంత కష్టపడి కట్టుకున్న ఇల్లు, లేక కొనుగోలు చేసిన స్థలం చివరకు మన చేతి నుండి జారిపోయే పరిస్థితి వస్తే ఆ భాద వర్ణించలేము. అందుకే ఇంటిని, స్థలాన్ని కొనుగోలు చేసే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.. లేకుంటే ఇబ్బందులు తప్పవు. అందులో తెలంగాణలోని హైదరాబాద్ లో అయితే మరీ నిశితంగా పరిశీలించి వీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.హైదరాబాద్ లో ఇటీవల హైడ్రా బఫర్ జోన్, ఎఫ్టిఎల్ పరిధిలో గల అక్రమ నిర్మాణాలను కూల్చేస్తోంది. దీనితో మధ్యవర్తుల మాటలు నమ్మి ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలలో గృహాలు నిర్మించుకొని మోసపోయిన వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ధనవంతులకైతే ఏం ఫర్వాలేదు.. కానీ తమ కష్టార్జితంలో ఇళ్లు కట్టుకున్నవారి పరిస్థితి అయితే దారుణమే. తాము ఎన్నో కలలతో నిర్మించుకున్న ఇల్లు హైడ్రా పరిధిలోకి వస్తే ఎలా అనే సందేహాలు అధికంగా నగరవాసుల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. అందుకే హైదరాబాద్ లో ఇల్లు, స్థలం కొనుగోలు చేస్తున్నామని మురిసి పోవడం కంటే ముందుగా ఈ విషయాలు తెలుసుకుంటే మీ డబ్బు సేఫ్.రివర్ వ్యూ సూపర్ ఉంది కదూ.. లేక్ వ్యూ చూసినా చాలుగా అనుకొని ఇంటిని కానీ, స్థలాన్ని కానీ కొనుగోలు చేశారో.. మీది ఇక రోడ్ వ్యూ కాక తప్పదు. అందుకే హైదరాబాద్ లో ఇల్లు, స్థలం, ఫ్లాట్ కొనుగోలు చేసేవారు.. ముందుగా అవి అక్రమ నిర్మాణాలా, కాదా అనేది తెలుసుకోవాలి. ఇందుకోసం మీ దగ్గరలోని లీగల్ అడ్వైజర్లను, రెవెన్యూ అధికారులను సంప్రదించాలి. అప్పుడు ఆ స్థలం పూర్తి చరిత్ర మీరు తెలుసుకొనే అవకాశం ఉంటుంది. అలాగే మీరు కొనే గృహం ఎవరి పేరుపై ఉందో తెలుసుకోవాలి. ఎందుకంటే ఆ గృహం వేరే వారిపై ఉండి, మనం మనకు విక్రయించే వారికి డబ్బులు ఇచ్చామో మన డబ్బు హాంఫట్ స్వాహానే. అందుకే అసలు స్థలం, ఇల్లు ఎవరి పేరుపై ఉందన్న పూర్తి వివరాలు తెలుసుకొని ఉండాలి.. అది కూడా పూర్తిగా ధృవీకరించుకున్నాకే మనం కొనుగోలు చేసేందుకు ముందడుగు వేయాలి. స్థలం లింకు డాక్యుమెంట్స్, ఇంటి పట్టాలు అన్నీ ఒకసారి చెక్ చేసుకొని, సంబంధిత అధికారి వద్దకు వెళ్లి పూర్తిగా నిర్ధారించుకోవాలి. పంచాయతీల పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలమా.. లేక గ్రామ కంఠమా అనేది తెలుసుకోవాల్సిందే.. లేకుంటే ఏనాటికైనా ముప్పే.ఆస్తుల విషయంలో అన్ని జాగ్రత్తలు మనం తీసుకున్నప్పటికీ మనం అక్కడక్కడా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటాం. అప్పుడు న్యాయ సలహా తీసుకొని ముందుకు సాగడం మంచిది. అలాగే హైడ్రా తాజాగా ప్రజలు ఎవరూ మోసపోకుండా ఇటీవల తన అధికారిక వెబ్ సైట్ ద్వారా ఒక జాబితాను పొందుపరిచింది. ఆ జాబితాను మనం పరిశీలించినా.. మనం కొనే స్థలం, ఇల్లు హైడ్రా పరిధిలోకి వస్తుందా.. లేదా అన్నది మనకు తెలుస్తుంది. అలాగే మనకు నమ్మకస్తులు అయినప్పటికీ.. స్థలాల కొనుగోలు విషయంలో అన్నీ పత్రాలు సబబుగా ఉన్నాయా లేవా అనేది పరిశీలించుకోవాల్సిందే. చెరువుల పరిధిలోకి వచ్చే గృహాలను మనం కొనుగోలు చేస్తే చివరికీ.. మనం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇవన్నీ ఆలోచించి, నిర్ధారించుకున్నాక మీ సొంతింటి కల నెరవేర్చుకొనేందుకు ముందడుగు వేస్తే మంచిదని న్యాయ నిపుణులు తెలుపుతున్నారు. పైపై అందాలు చూసి మురిసిపోయి, డబ్బులు ఇచ్చారో.. మీ దారి రహదారే కానీ మీ ఇంటి దారి మాత్రం కాదు. అందుకే తస్మాత్ జాగ్రత్త సుమా !

## మరో ఎన్నికకు సిద్ధం

**నల్గొండ, అక్టోబరు 2, పెన్ పవర్:** తెలంగాణ మరో ఎన్నికకు సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా టీచర్ ఓటర్ల నమోదుకు షెడ్యూలు విడుదల చేసింది. వచ్చే నవంబరు ఆరవ తేదీ వరకు ఓట్లు నమోదు చేసుకోవాలని నిర్ణయించింది. నల్గొండ - ఖమ్మం ? వరంగల్ శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నిక జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈ నియోజయవర్గం నుంచి సీపీఎం అనుబంధ ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ నేత ఎ.నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయన 2019లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. కాగా, ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. కనుకనే, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఫిబ్రవరిలోగా ఎన్నిక జరపాల్సి ఉంది.నల్గొండ - ఖమ్మం ? వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి జరగాల్సిన ఎన్నికకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి ఎమ్మెల్సీ పదవీకాలం మరో అయిదు నెలలు ఉన్నా ముందుగా ఓటర్ల నమోదు కోసం షెడ్యూలు విడుదల చేసింది. నవంబరు 6వ తేదీ వరకు ఓట్లు లేని కొత్త ఉపాధ్యాయులు తమ ఓట్లను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.నవంబరు 23వ తేదీన ముసాయిదా ఓటరు లిస్టును ప్రకటిస్తారు. కాగా, ఎన్నికల కమిషన్ సోమవారం ఓటర్ల జాబితాను ప్రకటించింది. టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని పన్నెండు జిల్లాల పరిధిలో 20,888 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 13,658 మందికాగా 7,227 మంది మహిళా ఓటర్లు, ముగ్గురు ఇతర ఓట్లు ఉన్నారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానిన దక్కించుకునేందుకు ఆయా టీచర్ యూనియన్లు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో యూటీఎఫ్ నుంచి ఆ సంఘం రాష్ట్ర నాయకునిగా ఉండిన ఎ.నర్సిరెడ్డి గెలిచారు. మరో వైపు పీఆర్టీయూలో వచ్చిన చీలికలు, రెబల్ అభ్యర్థుల వల్ల యూటీఎఫ్ గెలుపు తేలికైంది.అంతకు ముందు పీఆర్టీయూ నుంచే ఎమ్మెల్సీగా పనిచేసిన నల్గొండ జిల్లాకు చెందిన పూల రవీందర్ మొదట కాంగ్రెస్ కు అనుబంధంగా ఉండడంతో ఆ పార్టీ మద్దతుతోనే గెలిచారు. కానీ, ఆ తర్వాత పూల రవీందర్ కాంగ్రెస్ వైపు నుంచి బీఆర్ఎస్ కు దగ్గరయ్యారు.వాస్తవానికి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరిగేవే. కాకుంటే ఆయా రాజకీయ పార్టీలకు అనుబంధ సంఘాలుగానో, లేదా మద్దతుతోనే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ దగ్గర అయిన పూల రవీందర్ సిట్టింగ్ ఎమ్మెల్సీగా పోటీ చేసి యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.పూల రవీందర్ ఓటమిలో ఆయన సొంత సంఘం పీఆర్టీయూ నుంచే వరంగల్ జిల్లాలకు చెందిన సర్వోత్తమ్ రెడ్డి తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలవడం ప్రధాన భూమిక పోషించింది. ఈ సారి జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానంగా సిట్టింగ్ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న యూటీఎఫ్, పీఆర్టీయూ అదే మాదిరిగా బీజేపీ అనుబంధ టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘాలు ప్రధాన పోటీదారులుగా ఉండనున్నారు.ఉపాధ్యాయ వర్గాల సమాచారం మేరకు యూటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి రెండో సారీ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. పీఆర్టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నల్గొండ జిల్లాకే చెందిన మరో నాయకుడు సుంకరి బిక్షం గౌడ్ మధ్య టికెట్ కు పోటీ ఉండే సూచనలు ఉన్నాయి.

## తిరుమల లడ్డు కోసం ప్రాయశ్చిత్త ర్యాలీ

**కాకినాడ పెన్ పవర్:** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేటితో దీక్ష విరమిస్తున్నారు. తిరుమల లడ్డు కలుషితం తో పాటు గతంలో ఆలయాలు కూల్చివేసారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన దీక్ష చేపట్టారు. అందుకు మద్దతుగా కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం కాకినాడలో ర్యాలీ నిర్వహించారు.

కాకినాడ రూరల్ సర్పవరం సెంటర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనం చేసుకుని అక్కడ నుంచి శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రెండు ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం నానాజీ మీడియాతో మాట్లాడారు.

## మద్యం మత్తులో కారు బీభత్సం

**పరిగి పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా పరిగి టీచర్స్ కాలనీలో కారు బీభత్సం సృష్టించింది.మద్యం మత్తులో షిఫ్ట్ కారు నడుపుతూ మూలమలుపు ఉండడంతో అతివేగంగా వస్తున్న కారు తమ ఇళ్ల ముందు కట్టపై అక్కడే కూర్చున్న మహిళలపై దూసుకునివెళ్లి వారిని తప్పించబోయి ఫుల్లుగా మద్యం మత్తులో కాలనీలో అతివేగంగా కారు నడుపుతూ నేరుగా వెళ్లి విద్యుత్ కరెంటు పోల్ ని తన కారుతో డికొట్టాడు. విద్యుత్ కరెంటు స్తంభం కిందినుంచి పూర్తగా విరిగి కారు ముందుభాగం పైనుంచి వెనకభాగంపై పడిపోయింది విద్యుత్ స్తంభం..స్తంభం విరిగిన వెంబడే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.విద్యుత్ స్తంభం విరిగిపోయే సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటుంటారు..కారులో ఇరుక్కుపోయిన కారు యజమాని (డ్రైవర్) కారులోని రెండు బెలున్స్ ఓపన్ కావడంతో ప్రాణపాయం నుంచి బయటపడ్డాడు.కారులో ఇరుక్కుపోయిన వ్యక్తిని స్థానికులు బయటకు తీశారు .కారులోంచి బయటకు వచ్చిన వ్యక్తి కనీసం నిలబడలేకపోయాడు అంటే అంత మత్తులో ఉన్నాడు. అనంతరం కారు బీభత్సం సృష్టించిన కార్ డ్రైవర్ ని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు .విద్యుత్ కరెంటు స్తంభం విరిగిపోవడంతో రెండు గంటలపాటు పట్టణంలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.అప్పటికప్పుడు కరెంటు కొత్తలైన్ వేసి విద్యుత్ సరఫరా చేశారు విద్యుత్ అధికారులు.ఈ ప్రమాదం రాత్రి సమయంలో జరగడం వల్ల ప్రాణనష్టం జరగలేదని ఎప్పుడు రద్దిగా ఉండే ఈ కాలనీలో ప్రమాదం జరిగే సమయంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని కాలనీ వాసులు తెలిపారు.

## స్వచ్ఛత హే సేవ

**కాకినాడ పెన్ పవర్:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'స్వచ్ఛత హే సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు .నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

లుత స్థానిక గాంధీ పార్క్ మెక్లారిన్ నుంచి హై స్కూల్ వరకు 15 నిమిషాల వాకింగ్ నిర్వహించారు. మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ భావన ,ఎమ్మెల్యే కొండబాబు ప్రసంగించారు.

## తీరని గిరిజనుల కష్టాలు పార్వతీపురం మన్యం

**పెన్ పవర్:** గిరిజన సంక్షేమ మంత్రి సంధ్య రాణి జిల్లాలో గిరిజనులు కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజన గ్రామాల్లో గిరిజనుల తలరాతలు మాత్రం మారడంలేదు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలు పొందలేని దుస్థితి నెలకొంది. కొమరాడ మండలం సీసాడవలస గ్రామానికి చెందిన నికిత అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనం గ్రామానికి వచ్చే పరిస్థితి లేక స్థానికులు యువత మంచం పైన ఆమెను తీసుకువచ్చారు.

## అడ్డంగా బుక్కైన సాహితీ లక్ష్మీనారాయణ....

**హైదరాబాద్ పెన్ పవర్:** 2019లో అమీన్ పూర్ శర్వాని ఎలైట్ పేరుతో ప్రీలాంచ్ డిపాజిట్లు సేకరించి శఠగోపం పెట్టిన తర్వాతే సాహితీ లక్ష్మీనారాయణ గురించి చాలా మందికి తెలిసింది. పొలిటికల్ లీడర్లు, సినిమా స్టార్లను ఈజీగా ఏమార్చిన ఘనత సాహితీ లక్ష్మీనారాయణది. అలాంటిది కామన్ మ్యాన్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. అందుకే తియ్యటి మాటలకు చాలా మంది డబ్బులు సమర్పించుకుని బలైపోయారు. టీటీడీ బోర్డ్ మెంబర్ దాకా వెళ్లాడంటే పరపతి ఏ స్థాయిలో పెంచుకున్నాడో అర్థమవుతుంది. 2021 సెప్టెంబర్ లో టీటీడీ బోర్డ్ మెంబర్ అయ్యారు బూదాటి లక్ష్మీనారాయణ. అప్పుడు సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేయడంతో టీటీడీ బోర్డ్ మెంబర్ పదవికి రాజీనామా చేశారు లక్ష్మీనారాయణ. కథ తవ్వితే చాలా పెద్దది మరి. లక్ష్మీనారాయణ స్వస్థలం చిలకలూరిపేట. చిన్న బట్టల షాపుతో వ్యాపారం మొదలెట్టారు. అక్కడ ఐపీ పెట్టేసి గుడ్ బై చెప్పేశారంటారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు అందులో యాక్టివ్ గా మారాడు. చిరంజీవికి దగ్గరగా మసులుకున్నాడు. చివరికి చిరంజీవి పేరును చాలా వరకు మిస్ యూజ్ చేశాడంటారు. ఈ వ్యవహారం తేడాగా ఉందన్న కారణంతో ఆయన్ను పిఆర్పీ నుంచి బయటకు పంపించేశారు. ఇక అక్కడి నుంచి ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా స్టోరీ మార్చేశాడంటారు.2014 నుంచి 2019 మధ్య లోకేశ్ కు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. అప్పట్లో లోకేశ్ ఐటీ శాఖ మంత్రిగా ఉండడంతో ఐటీ టవర్ల నిర్మాణం పేరుతో హడావుడి చేశారు లక్ష్మీనారాయణ. మొత్తం కెరీర్ లో పేరు ఒకరిది వాడుకోవడం, ఉపయోగించుకోవడం ఇదే కథ. అంటే లోకేష్ పేరు చెప్పడం, ఐటీ టవర్లలో స్పేస్ ఇస్తానని ఐటీ కంపెనీలకు బురిడీ కొట్టడం, తానే దగ్గరుండి టవర్లు కడుతున్నానని చెప్పుకోవడం ఇలాంటివెన్నో అప్పట్లో జరిగాయి. ఫుల్ పైసా వసూల్ కార్యక్రమమే. 30 అంతస్తుల పేరు చెప్పి ఒక్కటీ కట్టలేదు. అంతే కాదు రాజకీయ నేతలు ఎన్నికల్లో పోటీ చేసే టైంలో భారీగా చందాలు కూడా ఇచ్చిన దాఖలాలు ఉన్నాయంటారు.

2019 వైసీపీ గెలిచాక ఆ పార్టీకి దగ్గరయ్యే ప్రయత్నం చేశారు లక్ష్మీనారాయణ. అంతకు ముందు స్వరూపానందకు దగ్గరై.. ఆయన ద్వారా టీటీడీ బోర్డు మెంబర్ పోస్టు తెచ్చుకున్నారని చాలా మంది చెప్పుకుంటారు. సో చెప్పాలంటే మధ్యలో ఉన్న వారి పేరును వాడుకుని పనులు చేయించుకోవడంలో ఘనాపాఠిగా మారాడన్నది అభియోగం. వ్యాపారానికి ప్లస్ అవుతుందని చాలా మంది పేర్లు చెప్పుకుని వ్యవహారం నడిపించారంటారు. అంటే ఏ స్టేట్ మెంట్ ఇచ్చినా జనం ఈజీగా నమ్మాలి కదా. అందుకే.. సమాజంలో పేరున్న వాళ్ల పేర్లు చెబితే జనం ఈజీగా అట్రాక్ట్ అయ్యి.. ముందుకొస్తారు.. అడ్వాన్స్ లు భారీగా సమర్పించుకుంటారని స్కెచ్ వేశాడు. అనుకున్నట్లుగానే అది చాలా వరకు వర్కవుట్ అయింది కూడా. అంతెందుకు 2018లో మంగళగిరి విల్లా వెంచర్ లో పవన్ కళ్యాణ్ ఓ ఇల్లు స్వయంగా కట్టుకుంటే.. అది తమ వెంచర్ లోనే ఉందని, మొత్తం వర్క్ తామే చూస్తున్నామంటూ ప్రచారం చేసుకున్నాడంటారు. సో అక్కడ పవన్ కళ్యాణ్ పేరు వాడుకున్నారు. పవన్ కళ్యాణే కొన్నారు. మనకూ గ్యారెంటీ ఉంటుందని చాలా మంది ముందుకొచ్చారు. అదే అదనుగా రేట్లు కూడా భారీగా పెంచేశాడన్నది అప్పటి ఆరోపణ.సినీ నటులతో బ్రోచర్లు.. కార్పొరేట్ తరహాలో ప్రకటనలు.. సినీ నటుల సమక్షంలోనే ప్లాట్ల కేటాయింపు.. ఇంద్రభవనాలను తలపించేలా గ్రాఫిక్స్ ఇలాంటివెన్నో చేస్తూ సాహితీ ఎండీ చేసిన కథలు అన్నీ ఇన్నీ కావు. ఏపీ, తెలంగాణ కాదేదీ అనర్హం అన్నట్లుగా పెద్ద ఎత్తున వెంచర్లు వేస్తున్నట్లు బిల్డప్ ఇవ్వడం, ముందుగానే డబ్బులు వసూల్ చేయడం, ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లడం. ఇదే స్టోరీ. గతేడాది గుంటూరు జిల్లా కాజా వద్ద వెంచర్ ప్రచారం కూడా ఇలాంటి స్కెచ్ లో భాగమే అని తేలింది. అప్పుడు బాధితులు పోలీసులను కూడా ఆశ్రయించారు. పలువురు సినీ నటులతో ప్రచారం చేయడం, సినీ నటులు ప్లాట్లు కొనకపోయినా కొన్నట్లుగా జనంలో ప్రచారం చేసుకోవడంతో? కృష్ణా, గుంటూరు జిల్లాలు, హైదరాబాద్‌తో సహా ఏపీలో వందలాది మంది కొనుగోలుదారులు ప్లాట్లు, విల్లాస్‌ను కొనుగోలు చేసేందుకు కోట్ల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించారు. సీన్ కట్ చేస్తే విల్లా లేదు, ఫ్లాట్ లేదు. కనీసం స్థల రిజిస్ట్రేషన్లు కూడా చేయలేదు. డబ్బులు తిరిగి ఇచ్చేయాలని అడిగితే ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయి. వాయిదాల మీద వాయిదాలు వేసి చివరికి స్విచ్ఛాఫ్ చేసుకోవడం, ఒత్తిడి పెరిగినప్పుడల్లా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇదే నడిచిందంటారు.ఒక్కో విల్లాను నలుగురైదుగురికి అమ్మడం, అది కూడా అగ్రిమెంట్ చేసి ఇవ్వడం, తీరా పొజిషన్ లోకి వచ్చే సరికి గొడవలు ముదరడం, అవి ఎవరికీ దక్కకుండా చేయడం ఇదే అసలు స్కెచ్. రైతుల నుంచి భూములు కొన్నా అగ్రిమెంట్లు చేసుకుని డబ్బులు కట్టకపోవడం, ఇటు కిస్తమర్ల నుంచి ప్రీలాంచ్ పేరుతో వసూళ్లు చేసి బిల్డింగ్ లు కట్టకపోవడం అంటే రెండువైపులా భారీగా శఠగోపం పెట్టిన పరిస్థితి. బాధితులంతా నెత్తీ నోరు కొట్టుకోవడం తప్ప ఏమీ మిగలలేదు. ఇలాంటి కేసులన్నీ హైకోర్టుకూ చేరాయి. ఇదే కాదు? ఇక హైదరాబాద్ లో అంతా నా చేతుల్లోనే ఉంటారు.. చెప్పివన్నీ జరుగుతాయని ప్రచారం చేసుకుని అగ్రిమెంట్లు, ప్రీలాంచ్ ఆఫర్లతో గేమ్ నడిపిస్తున్నారన్న ఆరోపణలకు లెక్కలేదు. అలా కేసులోనూ ముగ్గురు అధికారులు మారారని, కొత్తవారు వచ్చినప్పుడల్లా విచారణ మొదటికి వస్తుందంటున్నారు బాధితులు. పోలీసుల దగ్గరికి ఎన్నిసార్లు వెళ్లినా బలమైన ఆధారాలు లేవని చెప్పడం, కొంత వరకు భరోసా ఇవ్వడం వంటివి జరిగాయి. కానీ ఇప్పుడు మనీలాండరింగ్ ఇష్యూలో ఈడీ ఎంట్రీ అవడంతో సాహితీ ఇన్ ఫ్రా ఎండీ కథ ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్





**హైదరాబాద్, అక్టోబరు 2, పెన్ పవర్:** హైడ్రా, మూసీ ప్రక్షాళనను ఎందుకు బీఆర్ఎస్ అడ్డుకుంటోంది? నిజంగా పేదల తరపున ఆ పార్టీ పోరాటం చేస్తుందా? కొంతమందిని కాపాడేందుకు పేద, మధ్య తరగతి వర్గాల వారిని రెచ్చగొడుతుందా? వీటి పేరిట దోచుకున్నదెంత? ఇవే ప్రశ్నలు చాలామందిని వెంటాడుతోంది.అత్యంత కాలుష్యమైన నది ఏదంటే ముందుగా గుర్తు కొచ్చేది మూసీ. ఈ విషయాన్ని అనేక పర్యావరణ రిపోర్టులు చెబుతున్నాయి. ఈ లెక్కన మూసీ నది ఏ స్థాయిలో కలుషితమైందో అర్థమవు తోంది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో మూసీ వెంబడి దాదాపు 26 లక్షల మంది జీవిస్తున్నారు. కాలువ వెంబడి కేన్సర్ కారణాలు ఆర్సెనిక్, క్రోమియం, కాపర్, నికెల్, లెడ్ వంటి రసాయనాలను గుర్తించినట్టు ఎన్జీఆర్ఐ పేర్కొంది.హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలో 80 శాతం బీఆర్ఎస్ నాయకులు, బిల్డర్లే ఉన్నారని ఆరోపించారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్. దీనిపై సోషల్ మీడియాలో లేనిపోని అబద్దాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటివరకు మూసీ పరివాహక ప్రాంతాల్లో ఒక్క గుడిసె తీయలేదన్నారు.నది మధ్యలో ఉన్న కొన్ని కట్టడాలు తొలగిస్తున్నారని చెప్పుకొచ్చారు టీపీసీసీ. మూసీ కాలువకు కుడి, ఎడమ వైపు ఇళ్లులు తొలగించలేదన్నారు. గడిచిన పదేళ్లలో ఎంత కలుషితమైందో స్వయంగా రిపోర్టు చెబుతున్నాయి. ఆక్రమణల వెనుక బీఆర్ఎస్ నేతలతో కొందరు బీజేపీ నేతలున్నారని గుర్తు చేశారాయన.మూసీ వ్యవహారంలో బీఆర్ఎస్ వ్యవహారశైలిని తప్పుబట్టారు మరో కాంగ్రెస్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. మూసీ ప్రక్షాళనను అడ్డుకోడమంటే ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు మరణ శాసనం రాయడమేనన్నారు. మూసీ పేరు చెప్పి కారు పార్టీ వెయ్యి కోట్లు రూపాయలు వెనుకేసుకుందన్నది ప్రధాన ఆరోపణ.ఈ కాలువ ద్వారా పండే పంటలను ఎవరూ తినే పరిస్థితి లేదన్నారు రాజగోపాల్ రెడ్డి. కాటేదాన్, పటాన్ చెరు, జీడిమెట్ల, కూకట్‌పల్లి, సనత్ నగర్, నాచారం, ఏరియాల నుంచి నేరుగా విష రసాయనాలు వదిలేయడం వల్ల మూసీకి ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీనికితోడు హెచ్ఎండీఏ పరిధిలో ఇళ్ల నుంచి వచ్చే డ్రైనేజీ సైతం మూసీలో కలుస్తోందన్నారు. లక్షల మంది జీవితాలతో బీఆర్ఎస్ ఆటలాడుతోందని మండిపడ్డారు. మనీ రాజకీయాలు వద్దని కోరారు ఆయన.

# పార్టీ కార్యక్రమాలకు దూరంగా సంతోష్...



**హైదరాబాద్, అక్టోబరు 2, పెన్ పవర్:** జోగినిపల్లి సంతోష్.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో ఈయన హవా.. మామూలుగా ఉండేది కాదు. కేసీఆర్‌ను ఎవరైనా కలవాలంటే ముందుగా ఈయన పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉండేది. మినిస్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, పార్టీ నేతలు ఇలా.. ఎవరైనా సరే ఈయన్ను ప్రసన్నం చేసుకోవాల్సి ఉండేది. ఇలా.. ఆనాడు అన్నీ తానై నడిపించిన సంతోష్ ఇప్పుడు ఎక్కడున్నారనే చర్చ షురూ అయ్యింది. కొన్ని రోజులుగా సంతోష్.. ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌కూ దూరంగానే ఉంటున్నారని పార్టీ వర్గాల సమాచారం. సుమారు రెండు దశాబ్దాల పాటు కేసీఆర్‌కు నీడలా నిలిచిన ఆయన ఇప్పుడు అంటీముట్టనట్టు ఎందుకు ఉన్నారు.. ? పెద్దాయనే దూరం పెట్టారా?.. గతంలో ఉన్న సాన్నిహిత్యం ఎందుకు తగ్గింది ?.. పార్టీ కార్యక్రమాల్లోనూ ఆయన ఎందుకు పాల్గొనడం లేదు ?.. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎందుకు గళం విప్పడం లేదు ? కవిత అరెస్టు మొదలు తాజాగా హైడ్రాపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నా ఎందుకు స్పందించలేదు ? అటు కేసీఆర్‌కు దూరమై.. ఇటు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా పార్టీకి సంబంధం లేని.. అదీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్రీన్ ఛాలెంజ్ యాక్టివిటీస్‌కు పరిమితం కావడం ఏంటీ..? ఈ ప్రశ్నలే ఇప్పుడు పాలిటిక్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి.రాష్ట్ర రాజకీయాల్లో అనేక పరిణామాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలను గులాబీ నేతలు విమర్శిస్తున్నా సంతోష్ మాత్రం సేఫ్ డిస్టెన్స్ మెయింటెయిన్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీలు, రుణమాఫీ, రైతుబంధు, రైతుభరోసా, మహాలక్ష్మి స్కీమ్ అమలు, ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలు, శిశువులు మృతి చెందుతున్నా, కనీసం మందులు సైతం దొరకడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. తాజాగా హైడ్రా ఇష్యూ జోరుగా సాగుతున్నది. అయినా సంతోష్ మాత్రం 'నాకు సంబంధం లేదు' అన్న తీరులో వ్యవహరించడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ.. సీబీఐ, ఈడీ ద్వారా కవితను అరెస్టు చేయించిందంటూ కేటీఆర్, హరీశ్‌రావు సహా గులాబీ నేతలంతా విమర్శలు చేశారు. అయినా సంతోష్ ఏనాడూ ట్వీట్‌లు, స్టేట్‌మెంట్లు ఇవ్వలేదు. తిహార్ జైలులో ఉన్న కవితను చూసేందుకు ఫస్ట్ టైం వెళ్లడం మినహా మళ్లీ బెయిల్‌పై రిలీజ్ అయ్యే రోజునే ప్రత్యక్షమయ్యారని గులాబీ లీడర్లు చెబుతున్నారు. అయితే అరెస్టు పరిణామం కవిత, కేటీఆర్‌ను దగ్గర చేయగా.. సంతోష్‌తో మాత్రం ఈ ఇద్దరికీ గ్యాప్ గతంకంటే పెరిగిందనే మాట వినిపిస్తున్నది. మరో వైపు కవిత, కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రిలేషన్స్ దెబ్బతీసేందుకు సంతోష్ నడిపిన వ్యవహారమే కారణమనే అభిప్రాయాలూ అప్పట్లో వినిపించాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయ్యేంత వరకూ అటు పార్టీతో, ఇటు కుటుంబ సభ్యులతో కవితకు దూరం పెరిగిందని, అసెంబ్లీ ఎన్నికల్లో బాధ్యతలు అప్పజెప్పడానికి కూడా నాయకత్వం సంసిద్ధంగా లేదనే గుసగుసలూ వచ్చాయి. కానీ అరెస్టు తర్వాత కేటీఆర్, కవిత, హరీశ్‌రావు మధ్య పూర్వపు సంబంధాలు నెలకొనడంతో పాటు కేసీఆర్‌తో సంతోష్‌కు గ్యాప్ పెరిగిందనే మాటలూ ఇప్పుడు వినిపిస్తున్నాయి. సంతోష్ ఇప్పుడు.. పిలిస్తే తప్ప ఫామ్ హౌజ్‌కు వెళ్లడంలేదని, గతంలో అన్నీ తానై నడిపించిన పరిస్థితులు ఇప్పుడు లేవన్నది పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి.పదేండ్ల పాటు కేసీఆర్‌ను సొంత పార్టీ నేతలు సైతం కలవనీయకుండా సంతోష్ అడ్డం పడిన వ్యవహారం ఓటమి తర్వాత బహిర్గతమైందని, అందుకే ఆయన్ను దూరం పెట్టాలని కేసీఆర్ డెసిషన్ తీసుకున్నారనేది పార్టీ శ్రేణుల వాదన. సంతోష్ పాత్రను పరిమితం చేసిన తర్వాతనే వివిధ స్థాయిల్లోని లీడర్లు సహా కింది స్థాయి శ్రేణులు కేసీఆర్‌ను కలుసుకునే వెసులుబాటు లభించిందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమైందని తెలుస్తున్నది.కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన్ను కలిసేందుకు సంతోష్ అనుమతి కావాలా? అంటూ కవిత సైతం ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌కు ఆమె దూరం కావడానికి సంతోషే కారణమనే ఆరోపణలూ వచ్చాయి. కేసీఆర్ తర్వాత ఒక ప్రాక్సీ పవర్ సెంటర్‌గా చక్రం తిప్పిన జోగినపల్లి సంతోష్ ఇప్పుడు పార్టీ వ్యవహారాలకు దూరంగా, పార్టీతో సంబంధం లేని గ్రీన్ ఛాలెంజ్ కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కావడం చర్చకు దారి తీస్తున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాలైన అసోం, ఒడిశా రాష్ట్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలపైనే ఆయన ఫోకస్ పెట్టారు. బీజేపీతో రాజకీయ శతృత్వం లేకుండా పకడ్బందీ ప్లాన్ ప్రకారమే ఎవరికీ అర్థంకాని రీతిలో స్నేహ సంబంధాలు మెయింటెయిన్ చేస్తున్నారా?.. రెండేండ్ల క్రితం ఎంపీగా ఉన్న సమయంలో అన్ని పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులకు ఇన్విటేషన్ పంపి ఢిల్లీలో మొక్కలు నాటే కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ రెండు పార్టీలనూ బీఆర్ఎస్ రాజకీయ ప్రత్యర్థులుగా బహిరంగంగా పేర్కొంటున్నా సంతోష్ మాత్రం గ్రీన్ ఛాలెంజ్ పేరుతో వారితో సఖ్యతగా మెలగడంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. పార్టీ ఎమ్మెల్యేల ద్వారానే రాజ్యసభ ఎంపీగా ఆరేండ్లు కొనసాగిన సంతోష్.. ఇప్పుడు అదే పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా లేకపోవడం, పార్టీతో సంబంధం లేని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను పట్టుకుని తిరగడం, అందుకు బీజేపీ పాలిత రాష్ట్రాలను ఎంపిక చేసుకోవడం పార్టీలో సరికొత్త చర్చకు దారితీసింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన యాక్టివ్‌గా లేకపోవడాన్ని నేతలు ప్రశ్నిస్తున్నారు.

## రాజస్థాన్ కేంద్రంగా సైబర్ నేరాలు



**హైదరాబాద్, అక్టోబరు 2, పెన్ పవర్:** అదంటే సినిమా కాబట్టి కాస్త లిబర్టీస్ ఉంటాయి. కానీ రియల్ లైఫ్ లో అలాంటి సంఘటన జరిగింది. చదువుతుంటే ఆశ్చర్యం అనిపించినప్పటికీ ఇది ముమ్మాటికి నిజం. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. జేబు తెలియకుండా పర్స్ కొట్టేసే థియరీని సైబర్ దొంగలు విజయవంతంగా అమలు చేస్తున్నారు. అయితే సైబర్ నేరగాళ్ల బారిన పడి కేవలం నిరక్షరాస్యులు మాత్రమే కాదు, చదువుకున్న వాళ్ళు కూడా మోసపోతున్నారు. డబ్బులను నష్టపోతున్నారు. షేర్ మార్కెట్ అని, క్రిప్టో కరెన్సీ అని, మీ ఇంట్లో మాదకద్రవ్యాలు ఉన్నాయని.. ఇలా రకరకాల కారణాలు చెప్పి సైబర్ మోసగాళు ళ మోసం చేస్తున్నారు. ఇందుకోసం మ్యూల్ ఖాతాలు వాడుకుంటున్నారు. అలా డబ్బును ఆ ఖాతాల్లోకి మళ్లించుకుని.. ఆ తర్వాత డ్రా చేసుకుంటున్నారు. పోలీసులు రెస్పాండ్ అయ్యేలోపు తమ పని సులభంగా కానిచ్చేస్తున్నారు.. అయితే ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులకు ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువ కావడంతో.. కొంతకాలంగా వారు సీరియస్‌గా దృష్టి సారించారు. ఈ మోసాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయి? ఎవరు చేస్తున్నారు? ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి? సైబర్ మోసగాళ్లు నగదును ఏ ఖాతాల మీదుగా తమ ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు? అనే విషయాలపై పోలీసులు క్షుణ్ణంగా పరిశోధన సాగించగా మైండ్ బ్లాంక్ అయ్యే విషయాలు తెలిశాయి.ఈ మోసాలన్నీ కూడా రాజస్థాన్ కేంద్రంగా జరుగుతున్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు గుర్తించారు. కొంతకాలంగా వారు పరిశోధన చేస్తుండగా వెల్లడైన వివరాల ఆధారంగా ఆపరేషన్ రాజస్థాన్ నిర్వహించారు. ఈ క్రమంలో వివిధ రూపాయలలో సైబర్ నేరాలకు పాల్పడిన 27 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి భారీగా బ్యాంక్ చెక్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.. అయితే వీరంతా కూడా దేశంలోని వివిధ ప్రాంతాల్లో నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అమాయకులను బురిడీ కొట్టించి, లేని పోనీ భయాలను సృష్టించి నగదు తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నట్టు సమాచారం. అయితే వారి వద్ద నుంచి కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు.. మరింత లోతుగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.. అయితే ఈ నేరాలకు పాల్పడుతున్న వారంతా టెక్నాలజీపై విపరీతమైన పట్టు ఉన్న వారిని పోలీసులు చెబుతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.అయితే తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ విభాగాన్ని అత్యున్నతంగా ఆధునికీకరించడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఒక ఫిర్యాదు అందిన వెంటనే స్పందిస్తున్నారు. సైబర్ మోసగాళ్లు డబ్బును తస్కరించకుండా ఉండేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వారు డబ్బులు డ్రా చేయకుండా బ్యాంకు ఖాతాలోనే ఫ్రీజ్ చేయించగలుగుతున్నారు.. సైబర్ పోలీసులు ఇలా ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ.. మోసగాళ్లు మాత్రం తమ నేరాలను తగ్గించడం లేదు. పైగా కొత్త కొత్త రూపాలలో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు.

# ఆరుగురి ఎంపిక... రేవంత్ బిగ్ టాస్క్...



**హైదరాబాద్, అక్టోబరు 2, పెన్ పవర్:** కేబినెట్ విస్తరణ ఇప్పుడు అప్పుడు అంటూ లీకులు ఇవ్వడమే తప్పితే.. ఇంతవరకు విస్తరించింది అయితే లేదు. అటు పార్లమెంట్ ఎన్నికలు ముగిసి కూడా వంద రోజులు ఎప్పుడో గడిచాయి. ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి పది నెలలు అవుతోంది. కానీ.. ఇంతవరకు విస్తరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఆలస్యం అవుతున్న కొద్దీ రోజురోజుకూ ఆశావహుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో అధిష్టానానికి పెద్ద టాస్కులా మారింది.కేబినెట్ విస్తరణపై.. ఇటు ముఖ్యమంత్రి, అటు అధిష్టానం మధ్యం సయోధ్య కుదరడం లేదనే ప్రచారం కూడా ఉంది. అటు రేవంత్ రెడ్డి సిఫారసులు చేస్తుండడం.. పలువురు సీనియర్లు కూడా వారికి తోచిన వారి పేర్లు ఇస్తుండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రేవంత్ ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు క్లారిటీ వస్తుందని అనుకుంటున్నప్పటికీ ప్రతిసారీ వాయిదా పడుతూనే ఉంది. ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ఢిల్లీకి 23 సార్లు వెళ్లారు. అందులో మెజార్టీ ప్రయాణాలు కేబినెట్ విస్తరణపై చర్చించేందుకు వెళ్లారని ప్రచారం. నిన్న సాయంత్రం కూడా రేవంత్ మరోసారి ఢిల్లీకి వెళ్లారు. దాంతో మరోసారి కేబినెట్ విస్తరణ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది.రేవంత్ అధికారం చేపట్టాక 12 మందితో కేబినెట్ కొలువుదీరింది. మరో ఆరుగురికి ఛాన్స్ ఉండడంతో.. ఆ ఆరుగురి ఎంపిక పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పుడున్న కేబినెట్‌లోనూ చాలా వరకు నేతలు రేవంత్ కు తోడుగా నిలబడడం లేదనే టాక్ నడుస్తోంది. దాంతో ఆ ఆరుగురి ఎంపిక ఆయన కనుసన్నల్లోనే జరగాలనే భావనతో రేవంత్ ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే.. సీఎంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న సందర్భంలో ఒకరిద్దరు మినహా మిగితా వారి నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. బీఆర్ఎస్, బీజేపీలు నేరుగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నప్పటికీ వాటిని వ్యతిరేకించే వారు కరువయ్యారు.అందుకే.. మంత్రివర్గం నుంచి రేవంత్ కు పెద్దగా మద్దతు లభించడం లేదనే టాక్ వినిపిస్తోంది. అయితే.. రేవంత్ సిఫారసులకు పలువురు సీనియర్లు అడ్డు పడుతున్నారని తెలుస్తోంది. జమ్ము ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం కూడా తెలంగాణ కేబినెట్‌పై పెద్దగా దృష్టి సారించడం లేదు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు పూర్తికానున్నాయి. దాంతో ఇప్పుడు కేబినెట్ విస్తరణ అంశం తెరమీదకు వచ్చింది. ఇక నాన్చివేత ధోరణి అవలంబించకుండా.. ఏదో ఒకటి చేసి ఆ ఆరుగురిని ఎంపిక చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే.. అధిష్టానం నిర్ణయంలో సీఎం రేవంత్ సిఫారసులకు పెద్ద పీట వేస్తారా..? సీనియర్లకే ప్రాధాన్యత ఇస్తారా..? అనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ ఇచ్చిన పేర్లను ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలుస్తున్నా.. రేవంత్‌కు ప్రిపరెన్స్ ఇస్తే సీనియర్ల నుంచి ఎలాంటి వ్యతిరేకత వస్తుందా అని అధిష్టానం పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాష్ట్రం ఆరుగురిని ఎంపిక చేసే అంశం మాత్రం కాంగ్రెస్ అధిష్టానానికి బిగ్ టాస్క్ అయింది.

# సుప్రీం కోర్టు లక్ష్యంగా ట్వీట్ వార్

**విజయవాడ, అక్టోబరు 2, పెన్ పవర్:** ఐదు సంవత్సరాల విరామం తర్వాత తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేనతో జతకట్టింది. కూటమిగా ఏర్పడి వైసీపీని ఓడించింది. కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం చేసింది. ప్రజలు ఇచ్చిన బంపర్ మెజారిటీ ద్వారా చంద్రబాబు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అందులో బీజేపీ నాయకులకు, జనసేన నాయకులకు ప్రాధాన్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్లో బిజెపికి అధ్యక్షురాలిగా ఎన్టీఆర్ పెద్ద కుమార్తె పురందేశ్వరి కొనసాగుతున్నారు. గతంలో పురందేశ్వరి ? చంద్రబాబు కుటుంబాలకు మధ్య విభేదాలు ఉండేవి. ఆ తర్వాత వారు కలిసి పోయారు. అయితే ఇటీవల ఏపీలోని తిరుమలలో లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించారనే వాదనలు తెరపైకి వచ్చాయి. దీనిని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే ప్రస్తావించారు. దీంతో అది కాస్త జగన్మోహన్ రెడ్డికి ఇబ్బంది కలిగించింది. సహజంగానే తిరుమల అంటే దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదానికి విశేషమైన ప్రాచుర్యం ఉంది. అలాంటి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడారని సాక్షాత్తు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు జగన్మోహన్ రెడ్డికి తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. అటు వైసిపి, ఇటు కూటమి అన్నట్టుగా అక్కడ వ్యవహారం సాగింది. ఆ తర్వాత ఈ వివాదం కాస్త సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. సుప్రీంకోర్టు చంద్రబాబు నాయుడు ను మందలించింది. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయొచ్చా అని ప్రశ్నించింది.ఇది సహజంగానే వైసీపీకి బలంగా మారింది. ఇదే విషయాన్ని నిన్నటి నుంచి తన అనుకూల మీడియాలో తెగ ప్రచారం చేస్తోంది. అయితే దీనికి కౌంటర్ గా టిడిపి అనుకూల మీడియా కథనాలను ప్రసారం చేస్తోంది. ఇవి జరుగుతుండగానే పార్లమెంట్ సభ్యురాలు, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్పందించారు.

చంద్రబాబు నాయుడుకు అండగా ఉన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకునే అధికారం సుప్రీంకోర్టుకు ఎక్కడిదని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు మాట్లాడిన మాటలను సుప్రీంకోర్టు తప్పు పట్టడం సరికాదని ఆమె వ్యాఖ్యానించారు. ఆయనకు తెలిసిన సమాచారాన్ని చెప్పారని.. అందులో సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయాల్సిన అవసరం ఏముందని ఆమె పేర్కొన్నారు.పురందేశ్వరి ఆ వ్యాఖ్యలు చేయడంతో వైసీపీ సోషల్ మీడియా విభాగం గేమ్ మొదలుపెట్టింది. చూశారా సుప్రీంకోర్టును పురందేశ్వరి తప్పు పడుతోందని ప్రచారం ప్రారంభించింది. ఇక దీనికి తగ్గట్టుగానే టిడిపి అనుకూల సోషల్ మీడియా విభాగం కూడా రెచ్చిపోతుంది. గతంలో సుప్రీంకోర్టును ఉద్దేశించి జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యల తాలూకూ వీడియోలను కౌంటర్ గా పోస్ట్ చేస్తోంది.. మొన్నటిదాకా ఏపీ రాజకీయాలను శాసించిన తిరుమల లడ్డు వివాదం.. మళ్లీ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## ఇసుక మాయంపై పోలీసులు కేసులు నమోదు చేయాలి

**ఆళ్లగడ్డ పెన్ పవర్:** ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో మాయమైన ఇసుకపై మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి స్పందించారు. వైసిపి నాయకులు కార్యకర్తలతో ఇసుక డంపు యార్డును పరిశీలించారు.మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇసుక మాయం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయని అన్నారు. దాదాపు 600 పైగా మెట్రిక్ టన్నుల ఇసుక మాయమైతే పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదు. 20 నుండి 30 లారీలలో తరలిస్తే తప్ప అన్ని టన్నుల ఇసుక ఎలా మాయం అవుతుంది. సంభధిత అధికారులు స్టేషన్కు వెళ్తే ఫిర్యాదులు పోలీసులు ఎందుకు తీసుకోవడం లేదు. సీసీ ఫుటేజ్ లో పరిశీలించి దీని వెనుక ఉన్న ఆ రాజకీయ నాయకుడు ఎవరో పోలీసులు కనిపెట్టాలని అన్నారు.

## దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తాం: మంత్రి ఆనం

**విజయవాడ పెన్ పవర్:** దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. వీఐపీలకు ప్రత్యేక టైమ్ స్లాట్ వుంటుందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ , మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకూ వీఐపీల టైమ్ స్లాట్లు ఏర్పాటు చేసాం. వృద్ధులకు , దివ్యాంగులకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ దర్శనం టైమ్ స్లాట్. 500 రూపాయలు తీసుకున్న వారికి కూడా అంతరాలయం వెలువల నుంచే దర్శనం వుంటుంది. మొదటి రోజు ఉదయం 9 గంటలకు దర్శనాల ప్రారంభమవుతాయి. 13 శాఖల సమన్వయంతో ముందుకు వెళతాం . ఉత్సవాలకు ఘాట్ రోడ్డును అందుబాటులోకి తెస్తాం. వీఐపీల కోసం ప్రత్యేకంగా హోల్డింగ్ ఏరియాలు ఏర్పాటు చేశాం. వీఐపీల కోసం ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేశాం. ఆ వాహనాల్లోనే వీఐపీలను దర్శనానికి తీసుకువెళ్లి తీసుకొస్తాం. పవిత్రసంగమం ఘాట్ లో పవిత్రహారతులను పునరుద్ధరిస్తామని అన్నారు.

## చిన్నారి ఆచూకి కోసం పోలీసుల గాలింపు

**పుంగనూరు పెన్ పవర్:** పుంగనూరులో చిన్నారి అస్ఫియా మిస్సింగ్ ఘటనపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్పందించారు. చిన్నారి కుటుంబీకులతో మాట్లాడారు. మూడు రోజులయిన పాప ఆచూకి లభించలేదు. డాగ్ స్క్వాడ్ పసిగట్టిన ప్రదేశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.. 11 ప్రత్యేక బృందాలతో చిన్నారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని, పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. త్వరలోనే అస్ఫియా ఆచూకీని కనబడతామని అన్నారు.

## ఎల్ హెచ్ ఎం ను వినియోగించుకోవాలి పెద్దాపురం పోలీసులు

**పెద్దాపురం పెన్ పవర్:** పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహర్ రాజు పర్యవేక్షణలో సామర్లకోట పెద్దాపురం సిఐలు పెద్దాపురం మున్సిపల్ సెంటర్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి సామర్లకోట సీఐ కృష్ణ భగవాన్ మాట్లాడుతూ సెలవుల పై ఊర్లు వెళ్లే ప్రతి ఒక్కరు ఎల్ హెచ్ ఎమ్ సిస్టమును ప్రతి ఒక్కరు ఉచితంగా వినియోగించుకోవాలని తద్వారా ఏదైనా నేరం జరిగినప్పుడు అలారం మోగిన వెంటనే పోలీస్ సింగ్ అలర్ట్ వస్తుందని తద్వార నేర నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని , నేర నియంత్రణపై గ్రామ టౌన్ నగరాల్లో మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని , రాత్రి పుట పెట్రోలింగ్ గస్తీ బీటులు సంఖ్యను పెంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుమని ఆయన తెలియజేశారు ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు సి.ఐ.లు, క్రాంతి కుమార్. కృష్ణభగవాన్ ఎస్ఐ మౌనిక తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## పలాసలో రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు



**శ్రీకాకుళం పెన్ పవర్:** జిల్లాలోని పలాస కేటి రోడ్డులో ఎస్సార్ షాపింగ్ మాల్ సమీపంలో బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు. రోడ్డు పై నడిచి వెళ్తున్న చిత్త రెడ్డి సంతోషి అనే జీడిపిక్కల కార్మికురాలి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలు తాడు లాక్కొని పరారయారు. పుస్తెలు కింద పడపోగా బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధిత మహిళ లబోదిబో మంటూ కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అక్కడకు చేరుకొని దర్యాప్తు చేసుకుని, దొంగల కోసం గాలింపు చేస్తున్నారు.

## పునరావాసం కల్పించాకే తరలింపు ఎమ్మెల్యే బలాల

**హైదరాబాద్ పెన్ పవర్:** మూసీ పరివాహక ప్రాంత బాధితులనీదరికి డబుల్ బెడ్ రూంలు కేటాయించి పునరావాసం కల్పించాకే తరలింపు చేపడుతున్నారని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు.చాదర్ ఘాట్ శంకర్ నగర్ మూసా నగర్ మూసీ పరివాహక ప్రాంతాలను సందర్శించి బాధితులకు భరోసా కల్పించారు. బాధితులకు అండగా తాను ఉంటానని. ఆందోళన చెందవద్దని కోరారు. భవిష్యత్తు లో ఇబ్బందులు రాకుండా మూసీ చుట్టూ గోడ ఏర్పాటు చేయనున్నారని వివరించారు.

2003 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారని గుర్తు చేశారు అ సర్వే ప్రకారం మూసి పరివాహక ప్రాంతాలు అభివృద్ధి చేస్తే బాధితులకి నష్టం తక్కువ జరుగుతుందనేసి ఎంఐఎం నేతలు ప్రభుత్వ పెద్దలతో కలిసి వినత పత్రాన్ని అందజేశామని చెప్పారు. ప్రజలకి ఎలాంటి కష్టాలు వచ్చినా మేము ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

## స్థానికేతరులకు ఇళ్లు కేటాయించవద్దు

**సికింద్రాబాద్ పెన్ పవర్:** మూసి నిర్వాసితులకు ఖార్కానలోని రెండు పడక గదుల ఇళ్లను అప్పగిస్తున్నారన్న సమాచారంతో మడ్ ఫోర్ట్ రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద స్థానికులు ఆందోళన కు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానికంగా ఉన్న లబ్ధిదారులకు రెండు పడక గదులు కేటాయించకుండా మూసి నిర్వాసితులకు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసి నిర్వాసితుల కోసం రెవెన్యూ అధికారులు వచ్చి ఇల్లను సర్వే చేసి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికే మూడేళ్లు గడుస్తున్న స్థానికంగా ఉన్న తమకు ఇల్లులు కేటాయించలేదని బయట వ్యక్తులకు ఇల్లు కేటాయిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ధర్నాకు కూర్చున్న స్థానిక ప్రజలకు భాజపా నాయకుడు బీఎన్ శ్రీనివాస్ మద్దతు తెలిపి స్థానికులకే ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ మాదిరిగా అవకతవకలు జరగకుండా స్థానికులకే కేటాయించాలని కోరారు. టిఆర్ఎస్ నాయకురాలు నివేదిత సైతం ధర్నాలో పాల్గొని వారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## దిర్శించర్లలో ఖాళీ బిందెలతో మహిళలు నిరసన

**సూర్యాపేట పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల.దిర్శించర్లలో జాన్ పహాడ్ రోడ్డు ప్రధాన రహదారి వెంట మహిళలు ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. గత 15 రోజుల నుండి దిర్శించర్ల గ్రామంలోని ఎన్టీఆర్ నగర్ దుబ్బల మీద నీటి సదుపాయం లేక పలుమార్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవికి విన్నవించిన పట్టించుకోకపోవడంతో మహిళలు ఉద్వేగంతో జాన్ పహాడ్ రోడ్డు ప్రధాన కూడలి నందు ట్రాఫిక్ ను స్తంభిప చేసి తక్షణమే పంచాయతీ కార్యదర్శి వచ్చి నీటి సమస్యను పరిష్కారం చేసేందుకు హామీ ఇవ్వాలని కోరుతున్నారు

## సాగర్ కాలువలో ముగ్గురు గల్లంతు

## ఒక మృతదేహం లభ్యం



**ఖమ్మం పెన్ పవర్:** ఖమ్మం దానవాయిగూడెం ఎన్ఎస్పి కాలువలో మణుగూరుకు చెందిన ముగ్గురు గల్లంతు అయ్యారు. దానవాయిగూడెం సబ్ జైల్లో స్నేహితుడిని చూసేందుకు మణుగూరుకు చెందిన నలుగురు యువకులు వచ్చారు. మంగళవారం రాత్రి సాగర్ కాలువ వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం స్నేహితుడు వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి కాలవపై దుస్తులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గల్లంతైన యువకులు మణుగూరు మండలం శివలింగా పురంకు చెందిన చల్ల రమేష్, ప్రసాదు, బండారు భరత్ గుర్తించారు. గల్లంతైన ముగ్గురిలో భరత్ మృతదేహం లభ్యం అయింది. మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

## సిఐడీ చేతికి కాదంబరి కేసు..?

**విజయవాడ, అక్టోబరు 2, ( పెన్ పవర్:** ముంబయి నటీమణి కాదంబరి జెత్వాని కేసు కీలక మలుపు తీసుకోనుంది. ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం యోచిస్తోన్నట్లు తెలుస్తోంది. దీనిపై అతి త్వరలోనే ఉత్తర్వులు వెల్లడయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసులో నలుగురు పోలీసులతో పాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మరో న్యాయవాది మొత్తం ఐదుగురు వ్యక్తులు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం, వాదనలు పూర్తి చేసినట్లు సమాచారం. ఈ మేరకు తీర్పును రిజర్వు చేస్తూ అక్టోబర్ 4న వెలువరిస్తామని కోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు గత 15 రోజులుగా ఈ కేసుకు సంబంధించి ఏపీ ఉన్నత న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోంది. వాస్తవానికి ఈరోజు వరకు సదరు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు ప్రభుత్వానికి సూచించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి పాత్ర ఉన్న నేపథ్యంలోనే ఈ కేసును ఏపీసీఐడీకి అప్పగించేందుకు సర్కార్ కసరత్తులు చేస్తోంది. ముంబై నటి కాదంబరి జెత్వానీని వేధింపులకు గురి చేశారని ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నిపై విజయవాడ పోలీసులు కేసులు నమోదు చేశారు. కేసుకు సంబంధించి దిగువస్థాయిలో ఇన్‌స్పెక్టర్లు, ఆ కింద స్థాయి అధికారులు అప్రూవర్‌లుగా మారడంతో ముగ్గురు ఐపీఎస్‌లకు వ్యతిరేకంగా ఆధారాలు సేకరిస్తున్నారు పోలీసులు. కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే ఐపీఎస్‌లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే, అందుకు చాలా ప్రోసీజర్లను అనుసరించాలని యూపీఎస్సీ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆ తర్వాతే ఆల్ ఇండియా సర్వీసు అధికారులపై చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుంది. ఈ వ్యవహారంపై కాదంబరి జెత్వాని ఫిర్యాదుతో కదిలిన పోలీసులు దర్యాప్తు వేగం పెంచారు. ఈ కారణంగానే సీఐడీ విచారణకు ప్రభుత్వం నేడో రేపో ఉత్తర్వులు విడుదల చేస్తున్నట్లు సమాచారం




## హై క్వాలిటీ లిక్కర్ చీప్ కే...

**నెల్లూరు, అక్టోబరు 2, పెన్ పవర్:** మందు.. ఇది చాలా మందికి ఓ ఎమోషన్. అలవాటు పడ్డ బ్రాండ్ తప్ప వేరేది తాగాలంటే అబ్బే అంటుంటారు. గత ఐదేళ్లలో ఏపీలో మద్యం ప్రియులు ఇదే సిచ్యువేషన్‌ను ఫేస్ చేశారు. ఏవేవో కొత్త మద్యం బ్రాండ్లు టేస్ట్ చేయాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు ఎన్నాళ్లో వేచిచూసిన ఉదయం రానే వచ్చింది. తక్కువ ధరకే మంచి మందు దొరకబోతుంది. మంచి మందు టేస్ట్ కోసం తెలంగాణకు పోవాల్సిన అవసరం లేదు. అక్రమ దందా అని అభాసుపాలు కావాల్సిన పని లేదు. ఉన్న ఊరిలోనే ప్రజలకు ఛీప్ రేటులో హైక్వాలిటీ లిక్కర్ అందుబాటులో తేస్తుంది ప్రభుత్వం. అంతేకాదు లిక్కర్ దందా చేయాలనుకునేవారికి కూడా మంచి రోజులు వచ్చేసినట్లే. దసరాలోపే కొత్త మద్యం దుకాణాలను అందుబాటులోకి తేనుంది. 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన వైసీపీ లిక్కర్ పాలసీని చేంజ్ చేసింది. కొత్త బ్రాండ్లను తెచ్చింది. టెండర్ల విధానం తీసేసింది. దీంతో లిక్కర్ దందా చేసే లీడర్లు, వ్యాపారులకు బిజినెస్ చేసే ఆప్షన్ లేకుండా పోయింది. జనాలు కూడా ఏవేవో పిచ్చిపిచ్చి బ్రాండ్లతో కాలం నెట్టుకురావాల్సి వచ్చింది. ఇప్పుడు కొత్త లిక్కర్ పాలసీతో ఏపీలో మద్యం వ్యాపారులకు.. మందు ప్రియులకు కిక్కే కిక్కు లభించనుంది. టెండర్ల విధానంతో అన్ని పార్టీల నాయకులు లాటరీలో షాపులు దక్కించుకునే అవకాశం ఉంటుంది. అంతేకాదు తెలంగాణ నుంచి వెళ్లి కొందరు ఏపీలో షాపుల కోసం టెండర్లు వేస్తున్నారు. మందుబాబులకు కూడా గత ఐదేళ్ల కంటే ముందున్న బ్రాండ్లు మళ్లీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఏపీలో మొత్తం 3వేల 396 మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి కూటమి సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తు స్వీకరణ కొనసాగుతోంది. అప్లికేషన్ ఫీజ్ రూ.2లక్షలుగా డిసైడ్ చేశారు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 9 వరకు అప్లికేషన్లు స్వీకరించి..11న కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీసి లైసెన్స్‌లు ఇవ్వనున్నారు. ఈనెల 12 నుంచే మద్యం దుకాణాలను ప్రారంభించుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది ప్రభుత్వంకొత్తగా లైసెన్స్‌లు పొందే దుకాణాలకు ఈ ఏడాది అక్టోబర్ 12 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు అవకాశం కల్పిస్తారు. 3వేల 396 మద్యం షాపులకు అదనంగా 12 ప్రీమియం స్టోర్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. అంతేకాదు రాష్ట్రంలో మద్యం ధరల్ని కూడా తగ్గించారు. రూ.99కే క్వార్టర్ మద్యం లభించేలా రేట్లు నిర్ణయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మాట నిలబెట్టుకున్నారు సీఎం చంద్రబాబు. ప్రజలకు ఆరోగ్యానికి హానికరంగా లేని.. తక్కువ ధరలో మంచి లిక్కర్ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అమలు చేశారు. అంతేకాదు కొత్త లిక్కర్ పాలసీతో ఏపీ సర్కార్‌కు ఆదాయం కూడా చేకూరనుంది. దాదాపు 3వేల 4వందల షాపులకు టెండర్లు దాఖలైతే అవి కూడా వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మొత్తం మీద కొత్త మద్యం పాలసీతో స్వామికార్యం.. స్వకార్యం అన్ని నెరవేరబోతున్నాయి.

# కర్నూలులో రియల్ జై భీమ్....

**కర్నూలు, అక్టోబరు 2, పెన్ పవర్:** కర్నూలు జిల్లాలో పోలీసుల చర్యపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జైభీమ్ సినిమా తరహాలో కర్నూలులో పోలీసులు చర్యలు ఉన్నాయి. విచారణ పేరుతో తీసుకెళ్లి ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచారు. అంతేకాకుండా చిత్ర హింసలకు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. న్యాయవాదులు జోక్యంతో బాధితుడు విడుదల అయ్యారు. కర్నూలు త్రీ టౌన్ లో పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. దొంగతనం చేశారనే నెపంతో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని 18 రోజుల పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పోలీస్ స్టేషన్‌లోనే నిర్బంధించారు. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి పోలీసులు జె.మహేష్, ఆయన బావ వై.బాలకృష్ణను విచారణ పేరుతో తీసుకువెళ్లారు. బాధితుల తరఫున పిటిషన్ వేసిన మహేష్ భార్య జె. మాధవి 13వ తేదీన పోలీసులను కలిసినప్పటికీ, వారు ఎక్కడున్నారో కూడా చెప్పకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. కర్నూలు త్రీ టౌన్‌లో పోలీస్ స్టేషన్‌లో జై భీమ్ సినిమా తరహాలో పోలీసుల దాష్టీకానికి పాల్పడ్డారు. 18 రోజుల నుంచి అనుమానితులను బలవంతంగా బంధించారని, చిత్ర హింసలకు గురి చేశారంటూ బాధితుల బంధువుల ఆరోపించారు. 18 రోజులుగా తమ పిల్లలు కనపడడం లేదంటూ న్యాయవాదులను ఆశ్రయించటంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. జడ్జి సెర్చ్ వారెంట్ విధించడంతో అడ్వకేట్ కమిషనర్‌గా మాలిక్ బాషాను నియమించి, ఆయన ఆధ్వర్యంలో నేరుగా కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి అనుమానితుల స్టేట్మెంట్ రికార్డు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. సీఐ మురళీధర్ రెడ్డిపై గతంలో అనేక ఆరోపణలు కూడా ఉన్నాయి. అమాయకులను, అనుమానితులను, నిందితులగా బలవంతంగా కేసులు పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు త్రీ టౌన్ పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధిత బంధువులు ఉన్నతాధికారులను కోరారు. నేరం చేసిన ఏ ముద్దాయినైనా 24 గంటల్లోపు జడ్జి ముందు ప్రవేశపెట్టాలని, ఇక్కడ 18 రోజులు గడిచిన పోలీసులు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అన్నారు. కర్నూలు త్రీ టౌన్ పోలీసులు తీరుపై అడ్వకేట్లు, ప్రజా సంఘాలు నేతలు మండిపడుతున్నారు. వారిని విడుదల చేయాలంటే మూడు లక్షల రూపాయలు ఇవ్వాలని పోలీసులు డిమాండ్ చేశారని బాధితురాలి ఆరోపించారు. న్యాయవాదులు మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తులను చేయని నేరానికి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, వారిని వేర్వేరు చోట్లకు మార్చుతున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం అరెస్టు చేసిన 24 గంటల్లోపు, స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని, కానీ 18 రోజులు కావస్తున్నా, మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచలేదని అన్నారు. వారిని నిర్బంధించి చిత్ర హింసలకు గురి చేస్తున్నారని తెలిపారు. న్యాయవాదులు వెళ్లి మాట్లాడినప్పటికీ, సీఐ ఇది నా స్టేషన్ నా ఇష్టం అన్నట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. జె.మహేష్, ఆయన బావ వై.బాలకృష్ణను విడుదల చేయాలని తాము మేజిస్ట్రేట్ ముందు దావా వేశామని, అప్పుడు మేజిస్ట్రేట్ సెర్చ్ వారెంట్ ఇవ్వడంతో అడ్వొకేట్ కమిషన్‌తో పాటు తాము కూడా సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో సెర్చ్ చేశామని, అప్పుడు వారిని అక్కడ గుర్తించామని తెలిపారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టేందుకు తాము అడిగితే అప్పుడు సీఐ అనుమతి ఇచ్చారని వివరించారు. అడ్వొకేట్ కమిషనర్ మాలిక్ బాషా మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు బాధితులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు

# జడ్జి వద్దంటూ న్యాయవాదుల ఆందోళన

**లక్నో, అక్టోబరు 2, పెన్ పవర్: :** న్యాయమూర్తిని న్యాయం చేసే దేవుడిగా భావిస్తారు. అందుకే భారత దేశంలో ఇప్పటికీ కోర్టులపై విశ్వాసం ఉంది. ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గకుండా కోర్టుల్లో అయితేనే న్యాయం జరుగతుందని చాలా మంది విశ్వసిస్తారు. అయితే జాప్యం కారణంగా చాలా మంది ఏళ్లుతరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉంటే.. న్యాయమూర్తికి, కక్షిదారులకు మధ్య న్యాయవాదులు వారధిగా ఉంటారు. బాధితుల తరఫున వాదనలు వినిపిస్తారు. న్యాయమూర్తి చెప్పే తీర్పులను గౌరవిస్తారు. కట్టుబడి ఉంటారు. అయితే అలాహాబాద్ హైకోర్టు న్యాయవాదులు మాత్రం జడ్జిపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు బార్ అసోసియేషన్ కూడా సుప్రీం కోర్టును అభ్యర్థించింది. ఈమేరకు ఒక తీర్మానాన్ని కూడా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు పంపాలని నిర్ణయించింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ న్యాయవాది మిశ్రాపై క్రిమినల్ ధిక్కార చర్యలకు ఆదేశించింది. అతని చర్యలు దాని గౌరవాన్ని తగ్గించగలవని కోర్టు పేర్కొంది, ప్రధాన న్యాయమూర్తికి రిఫెరల్‌ను ప్రాంప్ట్ చేసింది. జస్టిస్ సంగీతా చంద్ర ఇచ్చిన ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అలాభాబాద్ బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. న్యాయ సంఘాల నుంచి మద్దతు బార్ అసోసియేషన్ మొదట జస్టిస్ సంగీతా చంద్ర కోర్టును బహిష్కరించాలని నిర్ణయించింది. అయినప్పటికీ, చాలా మంది న్యాయవాదులు ఆమె ఉన్న కోర్టులో తాము పనిచేయలేమని వాదించారు. అనంతరం కోర్టు విచారణలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం నిర్ణయించింది. యూపీ బార్ కౌన్సిల్ కూడా అలహాబాద్ న్యాయవాది మిశ్రాకు మద్దతు తెలిపింది. జస్టిస్ సంగీతా చంద్రను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆమె బదిలీ పూర్తయ్యే వరకు ఎలాంటి న్యాయపరమైన పని చేయకూడదని కౌన్సిల్ పట్టుబట్టింది. సంగీతా చంద్రను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని అభ్యర్థిస్తూ సుప్రీం కోర్టుకు లేఖ రాయాలని అలహాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. బార్ అధ్యక్షుడు అనిల్ తివారీ, తీర్మానాలను వెంటనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపే బాధ్యత అసోసియేషన్ కార్యదర్శికి ఉందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ వారి తీర్మానం కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ద్వారా భారత ప్రధాన న్యాయమూర్తికి పంపింది. జస్టిస్ చంద్రను బదిలీ చేయాలని, అప్పటి వరకు న్యాయపరమైన విధులు కేటాయించవద్దని డిమాండ్ చేశారు. ఉంటే.. ఈ పరిస్థితి దేశంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య ఉద్రిక్తతకు దారితీస్తోంది. అలభాబాద్ కోర్టు సీనియర్ న్యాయవాది న్యాయస్థానాన్ని 'కుంభకోణం' చేశాడని కోర్టు కార్యకలాపాల నిర్వహణపై అస్పష్టతలను ప్రదర్శించడం ద్వారా 'దాని గౌరవాన్ని తగ్గించాడు' అని గుర్తించిన తర్వాత డివిజన్ బెంచ్ (జస్టిస్ బ్రిజ్ రాజ్ సింగ్‌తో కూడి) ఈ సూచన చేసింది. టెండర్ కోసం పిటిషనర్ సాంకేతిక బిడ్‌ను తిరస్కరిస్తూ లక్నో నగర్ నిగమ్ జారీ చేసిన రెండు ఉత్తర్వులను సవాలు చేస్తూ డివిజన్ బెంచ్ రిట్ పిటిషన్‌ను విచారిస్తున్నప్పుడు సీనియర్ న్యాయవాది ఎస్‌సీ.మిశ్రాపై ధిక్కార చర్యను సిఫార్సు చేస్తూ ఆర్డర్ ఆమోదించబడింది. సీనియర్ న్యాయవాది ఇ మిశ్రా తరపున పిటిషనర్ వాదిస్తూ ఎల్ఎన్ఎన్/ఎల్ఎంసీ వారు అర్హులుగా భావించాలని, పిటిషనర్ కోసం ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవడానికి అనుమతించాలని వాదించారు. సెప్టెంబరు 25న జారీ చేసిన ఒక ఉత్తర్వులో, పిటిషనర్ సాంకేతికంగా అర్హత కలిగి ఉన్నట్లు గుర్తించిన మునుపటి టెండర్ నోటీసున,సవాలులో ఉన్న ప్రస్తుత టెండర్ నోటీసును కూడా రద్దు చేయడానికి సంబంధించిన రికార్డులను కోర్టు సమన్లు చేసింది. సెప్టెంబర్ 27న ఎల్ఎంసీ తరఫున న్యాయవాది కోర్టు డిమాండ్ చేసిన రికార్డును సమర్పించడానికి మరికొంత సమయం కోరారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, నగర్ నిగమ్ అధికారుల తరపున వ్యవహరించిన తీరును విమర్శిస్తూ, తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేయాలని కోర్టు కోరింది. అయితే ఈ సమయంలో విచారణ వాయిదాపై సీనియర్ న్యాయవాది (పిటిషనర్ తరఫు న్యాయవాది) అభ్యంతరం వ్యక్తం చేస్తూ నాగర్ నిగమ్ రికార్డును పరిశీలించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పట్టుబట్టారు. విజయవంతమైన బిడ్డర్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేయాలని ప్రతివాదులు భావిస్తున్నారని ఆరోపిస్తూ, అతను విషయం యొక్క ఆవశ్యకతను కూడా నొక్కి చెప్పాడు. దీనిపై సీనియర్ న్యాయవాది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈరోజు తుది నిర్ణయం తీసుకుంటామని కోర్టులో నినాదాలు చేశారు. కోర్టు పట్టుబట్టినప్పటికీ, మెరిట్‌లపై వాదించడానికి అతను నిరాకరించాడు. ప్రతివాదులకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేయడానికి మొగ్గు చూపుతున్నందున తాను ఏమీ చెప్పదలచుకోలేదని పేర్కొన్నాడు. కోర్టు తన ఇష్టానుసారం ఏదైనా ఉత్తర్వును జారీ చేయవచ్చని మరియు విషయాన్ని కొట్టివేయవచ్చని ఆయన అన్నారు. సీనియర్ న్యాయవాది చేసిన అటువంటి ప్రకటనలకు ప్రతిస్పందనగా, అటువంటి ప్రవర్తన కోర్టు అధికారాన్ని బలహీనపరుస్తుందని మరియు కోర్టు కార్యకలాపాలకు సాక్ష్యమిచ్చే జూనియర్ లాయర్లకు ప్రతికూల ఉదాహరణను సెట్ చేయగలదని కోర్టు ఎత్తి చూపింది. అయితే, న్యాయస్థానం ఆదేశం మేరకు, సీనియర్ న్యాయవాది అదే పద్ధతిలో కొనసాగడంతో, కోర్టు కార్యకలాపాల నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, వ్యక్తిగత దూషణలు చేస్తూ, అతనిపై క్రిమినల్ ధిక్కార చర్యలను ప్రారంభించాలని ప్రధాన న్యాయమూర్తికి కోర్టు సూచించింది.



# తుఫాను నష్టంతో మాకేంటి...

# ఇన్సూరెన్స్ కంపెనీల తిరకాసు

**విజయవాడ, అక్టోబరు 2, పెన్ పవర్:** విజయవాడ వరదల్లో నష్టపోయిన ప్రజల్ని ఆదుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొన్ని సంస్థలు మాత్రం విపత్తులో లాభాలను వెదుక్కుంటున్నాయి. దళారులతో కలిసి అందిన కాడికి దోచుకోడానికి ఎత్తులు వేస్తున్నాయి. వరదల్లో మునిగిపోయిన వాహనాలను ఇన్సూరెన్స్ ఎగ్గొట్టడంతో పాటు కారు చౌకగా వాహనాలను దళారులు దక్కించుకునేలా షోరూమ్‌లు, ఇన్సూరెన్స్ కంపెనీలు కుమ్మక్కయ్యాయి. రవాణా శాఖ చూసి చూడనట్టు వ్యవహరిస్తుండటంతో ఈ దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వరదల్లో మునిగిపోయిన కార్లను కారుచౌకగా కొట్టేయడానికి విజయవాడలో ఇన్సూరెన్స్ కంపెనీలు, కార్ల షోరూమ్‌లు కుమ్మక్కయ్యాయి. బుడమేరు వరదలతో సెప్టెంబర్ 1 నుంచి 12వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో వేలాది వాహనాలు నీటి ముంపుకు గురయ్యాయి. వీటిలో ద్విచక్ర వాహనాలకు రూ. 3వేలు, ఆటోలకు రూ. 10వేలు పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. కార్లు, రవాణా వాహనాలు, గూడ్స్ క్యారియర్లకు మాత్రం పరిహారం ప్రకటించలేదు. వరదల్లో వ్యక్తిగత వాహనాలతో పాటు కమర్షియల్ వాహనాలు కూడా భారీ సంఖ్యలో వరద ముంపుకు గురయ్యాయి. వరదలు తగ్గు ముఖం పట్టిన తర్వాత వాహనాలను షోరూమ్‌లకు తీసుకెళ్లిన యజమానుల్ని అందిన కాడికి దోచుకోడానికి అయా షోరూమ్‌లు ప్రయత్నిస్తున్నాయి. సంక్షోభం సమయంలో కూడా వ్యాపార అవకాశాలను వెదుక్కుంటూ లాభపడేందుకు ప్రయత్నిస్తున్నారు. వాహనాల బీమా మొత్తాన్ని తగ్గించడం, ఫుల్ డామేజ్ పేరుతో వాహనాలను కారు చౌకగా దక్కించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొత్త వాహనాలతో పాటు, ఇంకా ఈఎంఐలు పూర్తిగా చెల్లించని వాహనాలను కారు చౌకగా దక్కించుకోడానికి గుంటూరు నుంచి ముఠాలు విజయవాడలో తిరుగుతున్నాయి. నగరంలోని కార్ షోరూమ్‌లతో ఒప్పందాలు చేసుకుని వరదల్లో మునిగిన కార్లకు భారీగా అంచనాలు రూపొందిస్తున్నాయి. బయట ఒకటి రెండు లక్షల ఖర్చుతో వరదల్లో మునిగిన వాహనాలను పూర్వపు స్థితికి తెచ్చే అవకాశం ఉన్నా భారీగా అంచనాలు రూపొందిస్తున్నారు. కారు మోడల్‌ను బట్టి ఇన్సూరెన్స్ వచ్చే మొత్తాన్ని తక్కువ చేసి చూపిస్తున్నారు. కారు రిపేర్‌కు అయ్యే ఖర్చు కంటే ఇన్సూరెన్స్‌లో తక్కువ ధర వస్తుందని మాటలతో మభ్య పెడుతున్నారు. వీటికి సంబంధించి అంచనాలను అధికారికంగా మంజూరు చేయడం లేదు. రిపేర్ చేయడం కంటే కారును వదిలేసుకోవడం ఉత్తమం అని సలహా ఇస్తున్నారు. ఇలా కొత్ కారు త లేదు, పాతదని లేదు... నీటిలో కారు మునిగితే కాటాకు వేసేయడమేనని మాయ మాటలు చెప్పి వాటిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విజయవాడలోని అన్ని కార్ల షోరూమ్‌లలో ఇదే దందా నడుస్తోంది. 2019లో కొనుగోలు చేసిన హ్యుండాయ్ కంపెనీ కారు మరమ్మతులకు రూ.నాలుగున్నర లక్షల అంచనాలు వేసిన షోరూమ్ ఇన్సూరెన్స్ మూడు లక్షలు మాత్రమే వస్తుందని దాని బదులు కారును వదిలేసుకోవడం ఉత్తమం అని సలహా ఇచ్చారని ఓ బాధితుడు తెలిపారు. వరదల్లో మునగడానికి వారం రోజులు ముందు కొనుగోలు చేసిన వాహనానికి రిజిస్ట్రేషన్ కాలేదని వేధించారని మరో కారు యజమాని వాపోయాడు. విజయవాడలోని సుజుకీ నెక్సా, మహీంద్రా, కియా, టాటా, హ్యుండాయ్, టయోటా ఇలా అన్ని కంపెనీల షోరూమ్‌లలో వరదల్లో మునిగిన వాహనాలను ఇలాగే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనాల ఇన్సూరెన్స్ విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షలు నిర్వహిస్తున్నా, మరమ్మతుల కంటే వాటిని డిస్పోజ్ చేసేలా యజమానులపై ఒత్తిడి చేస్తున్నాయి. వరదల్లో మునిగిన కార్లను వాటి యజమానులు వదులుకుంటే షోరూమ్‌లకు కొత్త వాహనాలను విక్రయించడానికి వీలవుతుంది. వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసే ముఠాలు సెకండ్ హ్యాండ్‌లో విక్రయించుకునేందుకు వీలవుతుంది. ఇన్సూరెన్స్ కంపెనీలకు, కార్ల షోరూమ్‌లకు మళ్లీ కొత్త వ్యాపారానికి అవకాశం దక్కుతుంది. దీంతో సెకండ్ హ్యాండ్ కార్ల ముఠాలు, షోరూమ్‌లు, ఇన్సూరెన్స్ కంపెనీలు కుమ్మక్కై వరదల్లో పాడైన కార్లతో లాభపడేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వం వీటిని కట్టడి చేయడంలో ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో ఈ ముఠాలు పేట్రేగి పోతున్నాయి. వాహనాలను ఫుల్ డామేజ్ కింద కంపెనీలకు ఇచ్చేస్తే వాటిని స్క్రాప్ కింద నమోదు చేయాల్సి ఉంటుంది. ఇక్కడే షోరూమ్‌లు తెలివిగా వ్యవహరిస్తున్నాయి. వాటిని మరొకరి పేరుతో ట్రాన్స్‌ఫర్ చేస్తే ఎంతో కొంత లాభం వస్తుందని మభ్యపెడుతున్నారు. వారి మాటలు నమ్మిన వారు వాహనాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేస్తున్నారు.





# ఈ 9 రకాల ఫ్రూట్స్, కూరగాయలు తింటే.. ఆరోగ్యంతో పాటు అందం కూడా..!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరోగ్యమైన, అందమైన చర్మాన్నిఅందరూ కోరుకుంటూరు. అందుకోసం ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారు. రక రకాల క్రీములు రాస్తూ, ఫేస్ ప్యాక్లు వేసుకుంటూ మెరువులు అద్దుతుంటారు. అలా కాకుండా ఆహారంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మెరిసే చర్మం. మీ సొంతమవుతుంది. చర్మంపై ఏర్పడే మచ్చలు మొటిమలు పోయి ఆరోగ్యంగా కనిపించాలంటే ఏం తినాలంటే..

**పాలకూర**

విటమిన్-ఎ, బీటా కెరటిన్ లు పాలకూరలో పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనం గా నిగనిగలాడేలా చేస్తాయి. పాలకూరను రోజూ ఆహారంలో తీసుకుంటే నలభైలలో కూడా చర్మం మెరుస్తూ కనిపిస్తుంది. అలాగే శరీరంలోని వ్య రాలను బయటకు పంపడంలో పాలకూర బాగా పనిచేస్తుంది.

**క్యారెట్స్**

విటమిన్ -ఎ అధికంగా ఉండే క్యారెట్స్ తినడం. వల్ల కళ్లు, చర్మానికి చాలా మంచిది. వీటిని రోజూ తినడం వల్ల ఇన్ఫెక్షన్లు దరిచేరవు. ఇందులో ఉండే బీటా కెరటిన్ మంచి ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు చర్మాన్ని, జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతుంది.

**విటమిన్ బి6**

విటమిన్-బి6 ఎక్కువగా ఉండే క్యారెట్, కాలీఫ్లవర్, పొద్దుతిరుగుడు గింజల నూనె, వాల్నట్స్, అవకాడో హార్మోన్లలోని తేడాల వల్ల వచ్చే మొటిమలను నివారిస్తాయి. అలాగే హార్మో న సమతుల్యత సరిగా జరిగేలా చూసి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

**బొప్పాయి.**

బొప్పాయిలో విటమిన్-సి, ఇ, బీటాకెరోటిన్ అధికంగా ఉంటాయి. వీటిని రెగ్యులర్గా తీసు కోవడం వల్ల చర్మంపైన ఉండే డెడ్ స్కిన్ సెల్స్ దూరమై అందంగా మారతారు.

**ఒమేగా3 ఫ్యాటీ**

చేపలు, సోయా ఉత్పత్తు లో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల ఒత్తిడి, కుంగుబాటు, డిపై షన్ లాంటివి దూరమవుతాయి. చర్మం తాజాగా నిగనిగలాడుతుంటుంది. తాజా చేపల్లో ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ. ఇవి చర్మంలోని తేమను బయటకు వెళ్లనివ్వకుండా కాపాడి చర్మాన్ని మెరిపిస్తుంది.

**యాపిల్ ఆక్సిడెంట్స్**

యాపిల్, అరటి, నారింజ, జామ వంటి అన్ని రకాల తాజా పండ్లలో అన్ని రకాల విటమిన్లతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని ముడతలు పడేలా చేసే ఫ్రీ రాడికల్స్ ను తొలగిస్తాయి. అందుకే చర్మం యవ్వనంగాఉండాలంటే ఈ పండ్లు తినాలి. అలాగే పల్లీలు, బీట్ రూట్, కివీ పండ్లను తరచూ తింటే చర్మ సౌందర్యం మెరుగు పడుతుంది.

**బాదంప పప్పు**

విటమిన్-ఇ, యాంటీ ఆక్సిడెంట్లు బాదం పప్పుల్లో పుష్కలంగా ఉంటాయి. రోజూ 4 బాదం పప్పు బ్నిరాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే తింటే మంచిది. అలాగే కీరదోసకాయను తొక్కతో. తినడం మంచిది. అందులోని విటమిన్-ఏ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాదు కీరదోస కాయ ముక్కల గుజ్జును ముఖానికి పట్టి స్తే నల్లటి మచ్చలు దూరమవుతాయి.

**టొమాటోలు:**

టొమాటోలో విటమిన్-ఎ, కె.బి1, బి3, బి5,బి6, బి పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే టొమాటోలో ఉండే లైకోపిన్ అనే యాంటీ అక్సిడెంట్ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. యాంటీ ఏజింగ్ గుణాలు కూడా టొమాటోల్లో ఎక్కువగా ఉంటాయి. ఇవి కాలుష్యం, సూర్య కిరణాల నుంచి చర్మాన్ని రక్షించి ఆరోగ్యంగా ఉంచుతాయి.


**డార్క్ చాక్లెట్స్**

యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉండే డార్క్ చా క్లెట్స్ చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. అలాగే ముడిబియ్యం, పొట్టుతీయని ధాన్యాలు, బార్లీ, పొట్టు తీయని గోధుమలతో చేసిన బ్రెడ్స్ పేరు పదార్థాలు ఎక్కువ. ఇవి చర్మాన్ని బిగుతుగా చేసి యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

**ఇవి వద్దు**

కాఫీ, టీ, కూల్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్ కెఫీన్ ఎక్కువగా ఉంటుంది. ఇవి చర్మంలో నీ తేమను పీల్చుకుని చర్మం పొడిబారేలా చేస్తాయి. అలాగే కెఫిన్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తుంది కాబట్టి వ్యర్థాలు పేరు కుపోయే అవకాశాలు ఎక్కువ. పంచదార ఎక్కువగా ఉండే పదార్థాలైన కెట్లు, సోడా డ్రింక్స్. భోజనం తర్వాత తినే తీపి పదార్థాలు, స్వీట్స్ ఎక్కువగా ఉండే పా నీయాలను తీసుకోవడం చర్మానికి మంచిది కాదు. వీటివల్ల మొటిమలు వస్తాయి. బేకరీ ఫుడ్స్, బర్గర్స్, నిల్వ ఉంచి తీసుకునే ఫుడ్ కొవ్వు పదార్థాలు ఎక్కువ. అందువ ల్ల వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మ సౌందర్యాన్ని దెబ్బతీస్తాయి. చర్మం త్వరగా ముడతలు పడేందుకు దోహదం చేస్తాయి. నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు ఉపయోగించే పదార్థాల్లో ట్రాన్స్- ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ. ఇవి రక్తంలో కొవ్వు పదార్థాలను పెంచి చర్మంపై మొటిమలు పెరిగేందుకు దోహదం చేస్తాయి.

## ఇదో విచిత్రమైన కేసు: ఆ మాత్రం తెలివి కూడా లేదా.. ఎందుకు పనికొస్తార్రా మీరు..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏదైనా దొంగ పని చేసినా.. ఏదైనా వెధవ పని చేసినా వాడ్ని తిడతారు.. కొడతారు.. ఈ వార్త తర్వాత ఆ దొంగలను తిడుతున్నారు నెటిజన్లు.. కాకపోతే విచిత్రంగా.. వెరైటీగా తిడుతున్నారు.. అవును విచిత్రమైన కేసు ఇది.. మన దేశంలోనే.. మన గుజరాత్ రాష్ట్రంలోనే జరిగిన ఈ కేసు వివరాలు.. నెటిజన్ల రియాక్షన్స్ ఏంటో చూద్దామా..

గుజరాత్ రాష్ట్రంలో ఒక కోటి 60 లక్షల రూపాయల విలువైన.. నకిలీ 500 రూపాయల నోట్లు పట్టుబడ్డాయి. పట్టుబడిన నకిలీ నోట్లను చూసిన తర్వాత అందరూ షాక్ అయ్యారు.. ఎందుకంటారా..

**500 నోట్లపై గాంధీ ఫొటో ఉంటుంది.. వీళ్లు నటుడు అనుపమ్ కేర్ ఫొటో పెట్టారు.**

**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండాలి కదా.. వీళ్లు** Resole Bank Of India **అని రాశారు..**

**నోట్ల కట్టలపై బ్యాంక్ సీల్ ఉంటుంది కదా..** SBI Start Bank Of India **అని రాశారు..**

మన 500 నోట్లపై ఎవరి బొమ్మ ఉంటుందో కూడా వీళ్లకు తెలియదు..

కనీసంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనే స్పెల్లింగ్ కూడా తెలియదు..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. ఏకంగా స్టార్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంటున్నారు..

కనీసం చేసే వెధవ పనికి అయినా బ్రెయిన్ ఉండాలి కదా.. మినిమం అంటే మినిమం బుర్ర ఉండాలి కదా.. ఏదో ఒకటీ అరా నోట్లా అంటే.. ఏకంగా కోటి 60 లక్షల రూపాయల విలువైన 500 నకిలీ నోట్లు ప్రింట్ చేశారు.. అంటే వీళ్లకు అసలు నోటు ఎలా ఉంటుందో కూడా తెలియదా.. గాంధీకి.. అనుపమ్ కేర్ కు కూడా తేడా తెలియదా.. అసలు గాంధీ ఎలా ఉంటాడో కూడా తెలియదా.. అంతేనా.. వీళ్లు దేనికి పనికొస్తారు.. ఎందుకు పనికొస్తారు.. భారతదేశంలో ఇలాంటి యువకులు ఉన్నారా.. ఇలాంటోళ్లు ఉన్నారా అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు నెటిజన్లు. అసలు కంటే నకిలీ తయారు చేయటానికే ఎక్కువ తెలివి కావాలి.. అలాంటిది ఇలాంటి తెలివి తక్కువ వాళ్లు దేనికి పనికొస్తారు.. భవిష్యత్ లో ఇండియా ఎలా ఉంటుందో వీళ్లను చూసి ఊహించుకోండి అంటూ నెటిజన్లు తమ తమ స్టయిల్ లో ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు..



## గ్రీన్ టీలో.. కలబంద కలిపి తాగితే.. ఇట్టే బరువు తగ్గుతారు..!

కలబంద ముఖ సౌందర్యాన్నిపెంచడంలోనే కాదు, శరీర బరువు తగ్గించటంలో కూడా కలబంద ముఖ్య పాత్ర పోషిస్తుంది. గ్రీన్ టీలో ఒక స్పూన్ కలబంద జ్యూస్ కలుపుకుని తాగితే అధిక బరువు సమస్య నుంచి బయటపడొచ్చు. అలాగే గ్రీన్ టీలో కలబంద రసం, తేనె, నిమ్మరసం కలుపుకుని రోజూ పరగడుపున ఒక కప్పు, పడుకోవడానికి గంట ముందు ఒక కప్పు తాగితే మంచి ఫలితం ఉంటుంది. ఇతర పదార్థాలేవీ కలపడానికి ఇష్టం లేకపోతే రోజు గ్రామ గోరువెచ్చటి నీటిలో రెండు స్పూన్ల కలబంద జ్యూస్ కలుపుకుని తాగొచ్చు. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కొద్దిరోజుల్లోనే శరీర బరువులో మార్పు వస్తుంది. అలాగే ఏదైనా ఫ్రూట్ జ్యూస్ లో కలిపి కూడా కలబంద జ్యూస్ ని తాగొచ్చు. కావాలంటే అచ్చంగా కలబంద దసాన్ని కూడా తీసుకోవచ్చు.

# వెరైటీ : ఈ హెూటల్ కేవలం ఆడవాళ్లకు మాత్రమే.. మగాళ్లకు నో ఎంట్రీ..!






**హైదరాబాద్ పెన్ పవర్:** ఇల్లు, బస్టాప్, కాలేజ్, ఆఫీస్, ఈ నాలుగింటిలో ఆడవాళ్లు ఎక్కడ సేఫ్ గా ఫీలవుతారు..? ఆన్సర్ చెప్పడం కష్టమే.. ఎందుకంటే... ఆడపిల్లలపై జరుగుతున్న నేరాల్లో దోషులుగా శిక్ష అనుభవిస్తున్నవారు ఎక్కువగా దగ్గరివారే. ఇక బస్టాప్ యాసిడ్ దాడులకు అడ్డాగా మారిపోయింది. కాలేజీలో ర్యాగింగ్, ఆఫీసులో వేధింపులు.. ఇలా ప్రతిచోటా ఏదోరకంగా ఆడవాళ్లు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. మరి వారికి సేఫ్ ప్లేస్ ఏది లేదా? ఎందుకు లేదూ..? ఇదిగో మా హెూటల్ కేవలం ఆడవాళ్ల కోసమే అంటున్నారు సామ్ డోనా హెూటల్ నిర్వాహకులు.

సామ్ డోనా అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసిన నేమ్ ప్లేట్ మీదనే విమెన్ ఓన్లీ హెూటల్ అని క్యాప్షన్ కూడా కనిపిస్తుంది. అదేంటి హెూటల్ లో ఆడ, మగ అనే తేడా చూపిస్తారా? అందరికీ ఎంట్రీ ఉంటుంది కదా? అని అడగొద్దు... అన్ని హెూటళ్లలాగే ఉంటే.. మనం ఈ హెూటల్ గురించి చెప్పుకునేవాళ్లమే కాదు. అయినా విషయాన్ని స్పష్టంగా హెూటల్ బోర్డు పైనే పెట్టారు కదా.. ఆడవాళ్లకు మాత్రమేనని. స్పెయిన్ లోని బాలెయారిక్ దీవిలో సోమ్ డోనా పేరుతో ఓ స్పెషల్ హెూటల్ కనిపిస్తుంది. సోమ్ డోనా అంటే... "మేము మహిళలం" అని స్పెయిన్ భాషలో అర్థం. 14 సంవత్స రాలు దాటిన యువతులంతా ఈ హెూటల్లో ఉండవచ్చు. ఈ హెూటల్లోని ప్రతి అంగుళం స్పెషల్గా ఆడవాళ్ల కోసమే డిజైన్ చేసినట్లు ఉంటుంది.


ఇక్కడ పని చేసేవారిలో 90 శాతం మంది ఆడవాళ్లేనట. మిగతా 10 శాతం మంది కూడా మగవాళ్లేందుకు...? అని అడిగితే... అక్కడి ప్రభుత్వ నిబంధనలు అడ్డువచ్చాయట. ఉపాధిలో వివక్ష ఉండరాదనే కండిషన్ మీద కొంతమంది మగవాళ్లకు ఈ హెూటల్లో ఉద్యోగం ఇచ్చారు ఆదీ.. ఆడవాళ్లకు దూరంగా ఉండే చోటే వారిని నియమించారు. మగ ఉద్యోగుల వల్ల మహిళలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మగ ఉద్యోగులకు కఠిన నిబంధనలు కూడా అమలు చేస్తున్నారు.

అంతాబాగానే ఉంది. ఇంతకీ ఈ కాన్సెప్ట్ ఎందుకు? అంటే... కొన్నాళ్లు మగవాళ్లకు దూరంగా ప్రశాంతంగా ఉండాలని కోరుకునే మహిళల సంఖ్య ఇటీవల బాగా పెరుగుతోందట... ఇటువంటి వారికి సూటబుల్ డెస్టినేషన్ ఈ హెూటలే అంటున్నారు కస్టమర్స్. ఈ హెూటల్లో మగవాళ్లు ఉండేందుకు అవకాశం లేదు. అంతేకాదు.. పరిసరాల్లోకి కూడా వాళ్లు అడుగు పెట్టకూడదు. కుటుంబసభ్యులైనా, స్నేహితులైనా సరే... లోపలికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు. ఈ హెూటల్లో మహిళల భద్రతకు ఎలాంటి ఢోకా ఉండదని యాజమాన్యం చెబుతోంది. ఈ హెూటల్లో బార్, స్విమ్మింగ్ పూల్, బ్యాక్ సైడ్లో బీచ్, స్పా వంటి ఎన్నో సదుపాయాలున్నాయట. బార్లో ఇద్దరు ఆడవాళ్లు పక్కపక్కనే కూర్చొని మందు తాగడం కనిపిస్తుందని చెబుతారు అక్క డికి వెళ్లిన విజిటర్స్.అంతే కాదు.. బీచ్ లో, స్విమ్మింగ్ పూల్ లో, స్పాలో ఎక్కడ చూసినా ఆడ జంటలే కనిపిస్తాయట. 'ఇది మా సామ్రాజ్యం అనే ఓ గర్వం ఈ హెూటల్లో ఆడవాళ్ల ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు నిర్వాహకులు. సోమ్ గ్రూప్ అఫ్ హెూటల్స్ కు చెందిన ఈ ఆడవాళ్ల హెూటల్లో మిగతావాటి కంటే తక్కువే వసూలు చేస్తున్నారు. ఈ కాన్సెప్ట్ ను ప్రపంచానికి పరిచయం చేయడానికి, మరింత మంది మహిళలను తమ హెూటకు వచ్చేలా చేయటానికి తక్కువే వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రత్యేకించి మగవాళ్ల కోసమంటూ ఏదీ లేకపోయినా ఆడవాళ్లు కనిపించని హెూటల్స్. బార్లు రెస్టారెంట్లకు కొదవే లేదు. ఏ పట్టణానికి వెళ్లినా వందల సంఖ్యలో కనిపిస్తాయి. అలాంటప్పుడు పట్టణానికో హెూటల్ స్పెషల్ గా ఆడవాళ్ల కోసమే ఉంటే బెటరే కదా..

# హైదరాబాద్ సంస్థాన విమోచనానికి పాటు బడ్డ మహానాయకుడు స్వామి రామానంద తీర్థ

## నేడు ఆయన జయంతి

స్వామి రామానంద తీర్థ జీవితమే ఒక స్వాతంత్ర్య సంగ్రామం. నిజాం నియంతృత్వాన్ని ఎదిరించి పోరాడారు. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో నిర్మాణాత్మక పాత్ర పోషించారు. స్వామి రామానంద తీర్థ స్వాతంత్ర సమరయోధుడిగా, హైద్రాబాద్ సంస్థాన విమోచనానికి పాటు బడ్డ మహానాయకుడిగా, భారత పార్లమెంట్ సభ్యుడిగా, సన్యాసిగా, కార్మిక నాయకుడిగా, విద్యావేత్తగా అందరికీ సుపరిచితుడు. ఈయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి భాపూరావు, తల్లి యసుబాయి. 1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా, ఝువర్గీ తాలూకా సింధ్గీ గ్రామంలో ఆయన జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31 వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేయగలను అని ప్రతిజ్ఞ చేసి, ఆ ప్రకారమే ఉండిపోయిన ధీరోధాత్తుడు ఆయన. కళాశాల చదువుకు స్వస్తి చెప్పి, పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్ళు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎం.ఏ పట్టాని పొందారు. తొలుత కార్మిక రంగంలో పనిచేసి, కారాగార శిక్ష అనుభవించి ఆరోగ్యం అనుకూలించక, మరాఠ్వాడాలో ఉస్మానాబాదు జిల్లాలోని హిప్పర్గిలో నెలకొల్పబడిన జాతీయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులై, ఆరు సంవత్సరాలపాటు ఆ విద్యా సంస్థను గురుకుల పద్ధతిపై చక్కగా ఆయన నిర్వహించారు. 1932లో స్వామి నారాయణ అనే గురువు వీరికి 'విద్వత్ సన్యాసం ' అనే పద్ధతి ప్రకారం సన్యాస దీక్ష ఇచ్చి, ఈయనకు 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు. 1938లో రాజకీయరంగంలోకి ప్రవేశించి ఆయన మహారాష్ట పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు ఆయన మార్చారు. స్టేట్ కాంగ్రెస్ అనే సంస్థను నెలకొల్పడానికి స్వామిజీ ప్రయత్నం చేస్తుండగా, స్టేట్ కాంగ్రెస్ సంస్థను నిజాం ప్రభుత్వం 1938 సెప్టెంబర్లో నిషేధించింది.




ఆ నిషేధాజ్ఞలకు నిరశనగా స్వామి రామానంద తీర్థ హైదరాబాదులో 1938 అక్టోబరు 27వ తేదీన సత్యాగ్రహం చేయగా ప్రభుత్వం ఆయన్ను బంధించి, 18 నెలలు కఠిన శిక్షనమలుచేశారు. స్టేట్ కాంగ్రెస్ సంస్థపై నిషేధం తొలగించని కారణంగా, తాను వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియచేయగా, 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను బంధించి, ప్రజారక్షణ నిబంధనల క్రింద నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు. 1942-1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. దేశీయ సంస్థానాల మహాసభ కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింపబడ్డ బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని షోలాపూర్ నుంచి వీరు తిరిగిరాగానే ఆయనను నిజాం ప్రభుత్వం బంధించి1943 డిసెంబరులో విడుదల చేసింది. హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించినందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్బంధం నుండి విడుదల పొందారు. రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకులు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులుగాను, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగాను ఆయన పనిచేశారు. 1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నారు. 1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు స్వామీజీ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణా జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర ప్రాంతంలో కలిపేసి తెలుగు ప్రజల చిరకాల వాంఛయైన విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని ఒక ప్రకటన చేశారు.

అంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన అంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసమేర్పరు చుకొన్నారు. 1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. స్వామిజి 1972 జనవరి 22 వ తేదీన హైదరాబాదులో నిర్యాణం చెందారు.

# జగన్ బలం.. బలగం ఎక్కడ...



**విజయవాడ, అక్టోబరు 2, పెన్ పవర్:** నిన్న మొన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో వెలుగు వెలిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం పడిపోగానే ఆ పార్టీ పరిస్థితి దిగజారిపోయింది. అయితే వైసీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో, మండలిలో, ఇటు లోక్ సభ, రాజ్యసభలో కావాల్సినంత బలం ఉండేది. వాటితో ఎవరిపై ఆధారపడకుండానే సొంతంగానే చట్టాలు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఒకవైపు రాష్ట్రంలో శాసనసభ రూపొందించే చట్టాల్లో ఆ పార్టీదే ముఖ్యపాత్ర ఉండేది. మరోవైపు పార్లమెంటులోనూ వైసీపీది చెప్పుకునే స్థాయి పాత్రే. కానీ ఇప్పుడు పరిస్థితి అంతా తారుమారైంది. వైఎస్ జగన్ పార్టీ ప్రాధాన్యం లేకుండానే కేంద్ర రాష్ట్ర చట్టసభల్లో బిల్లులు పాస్ కానున్నాయి. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక శాసనమండలిలో మొత్తం 58 సీట్లకుగాను 8 మంది నామినేటెడ్ సభ్యులతో కలిపి జగన్ పార్టీకి 38 మంది ఎమ్మెల్సీలున్నారు. ఇందులోనే టీడీపీకి 8 మంది, నలుగురు ఇండిపెండెంట్లు, పీడీఎఫ్ నుంచి ఇద్దరు సభ్యులుండగా మరో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాగా జనసేన ఇంకా ఖాతా తెరవలేదు. టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి 175 స్థానాలకు గానూ ఏకంగా 164 స్థానాలను కైవసం చేసుకుంది.

**తెలుగుదేశం ? 135 సీట్లు,**

**జనసేన ? 21 స్థానాలు,**

**బీజేపీ ? 8.**

ఇక అసెంబ్లీలో సూపర్ విక్టరీ కొట్టిన కూటమి, రాష్ట్రంలోని రాజ్యసభ స్థానాలన్నీ ఆ కూటమి దక్కించుకునే అవకాశాలున్నాయి. మరోవైపు 2024 లోక్ సభ ఎన్నికల్లోనూ కూటమి పార్టీ జయభేరి మోగించింది. టీడీపీ 16, బీజేపీ 3, జనసేన 2 సీట్లు కలిపి మొత్తంగా 21 సీట్లు గెలుచుకున్నాయి. ఇక జనసేన పార్టీ ప్రారంభిన పదేళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా ఆ పార్టీ రాజ్యసభలోనూ అడుగుపెట్టనుంది. ఇప్పటికే లోక్ సభలోనూ జనసేనాని ప్రవేశించింది.

**వైసీపీ తాజా బలాబలాలు ఇవే :**

**అసెంబ్లీ ? 11**

**మండలి ? 38**

**లోక్ సభ ? 4**

**రాజ్యసభ ? 8**

కేంద్ర రాష్ట్రాల చట్టసభల్లో ప్రస్తుతానికి వైసీపీకి ఉన్న సీట్లు, స్థానాలు చాలా తక్కువ. వీటితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్క శాసనమండలిలో మినహా మరెక్కడా ప్రభావం చూపించలేని దయనీయ పరిస్థితిలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇటు రాష్ట్రంలోనూ ప్రతిపక్ష హోదా దక్కించుకోలేకపోయింది. రాష్ట్రంలో ఎప్పుడైనా అధికార పార్టీది లేదా కూటమిదే హవా నడుస్తుంటుంది. ఈ లెక్కన ఏపీ శాసనమండలిలో అధిక బలం కలిగిన వైసీపీని ప్రస్తుత అధికార కూటమి త్వరలోనే బీట్ కొట్టే అవకాశాలున్నాయట. ఇప్పటికే అసెంబ్లీలో భారీ మెజారిటీ సాధించిన కూటమి, వాటితో మండలిలోనూ తమ స్థానాలను మెరుగుపర్చునే దిశలో పయనిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనా ఒకప్పుడు ఏపీ రాజకీయాలను శాసించిన వైసీపీ, ఇప్పుడు అన్ని స్థాయిల చట్టసభల్లో తమ ప్రాభవాన్ని కోల్పోవడం గమనార్హం.

# తిరుమల లడ్డూ...యూటర్న్ లు తీసుకుంటున్న వివాదం...





**తిరుమల, అక్టోబరు 2, పెన్ పవర్:** చిన్నగా మొదలై.. పెద్ద ఇష్యూ అయింది. ఏపీకే పరిమితం అనుకున్న ఇష్యూ.. యావత్ హిందూలోకం రియాక్షన్‌కు రీజన్ అయింది. నేషనల్ టాపిక్ అయిన తిరుమల లడ్డూ వివాదం రోజురోజుకు పెద్దది అవుతోంది. బ్రహ్మాండనాయకుడి ప్రసాదం చుట్టూ.. పొలిటికల్ రచ్చ జరుగుతోంది. ఇన్ని రోజులు లోకల్‌వార్‌గా కొనసాగిన శ్రీవారి లడ్డూ వివాదం.. అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కెడంతో.. ఇది ఇంకా ఎటువైపు టర్న్ తీసుకుంటుందోనన్న సస్పెన్స్ కొనసాగుతోంది. లడ్డూ ప్రసాదంలో కల్తీ అంశం సుప్రీంకోర్టుకు చేరడం.. సిట్ విచారణ ఆగిపోవడంతో నెయ్యి ఇష్యూ మరింత పీక్ లెవల్‌కు చేరుకుంది. అయితే సిట్ విచారణ వద్దని కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ జాతీయ నేత సుబ్రహ్మణ్య స్వామితో పాటు మరో ఇద్దరు పిటీషన్లు వేశారు. వీటిపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. నెయ్యి కల్తీ అయినట్లు ఆధారాలు ఉన్నాయా అంటూ ప్రశ్నించడంతో పాటు.. దేవుడ్ని రాజకీయాలకు లాగొద్దంటూ అభిప్రాయపడటం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర దర్యాప్తు సంస్థకు ఇస్తే మంచిదని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే.. దర్యాప్తు సీబీఐ లేదా మరో కేంద్ర దర్యాప్తు సంస్థ చేతికి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు నియమించిన ఐజీ స్థాయి అధికారితో మొత్తం 9 మంది సభ్యుల సిట్ బృందం కొంత సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. అయితే కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉండటంతో సిట్ దర్యాప్తును ఆపేసినట్లు ఏపీ డీజీపీ ప్రకటించారు. రికార్డులు పరిశీలించడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో నెయ్యి కొనుగోలుకు సంబంధించి సిట్ బృందం అన్ని వివరాలు తీసుకుంది. ఒక సంస్థకు టెండర్లు దక్కితే మరో సంస్థ నెయ్యి సరఫరా చేస్తున్నట్లు సిట్ గుర్తించినట్లు తెలుస్తోందిఏఆర్ డెయిరీకి నిబంధనల ప్రకారం అర్హత లేకపోయినా.. కావాలనే టెండర్ నిబంధనలు సవరించి ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే నెయ్యి కూడా ఏఆర్ డెయిరీ నుంచి రావడం లేదని.. శ్రావణి డెయిరీ అనే సంస్థ నుంచి సరఫరా అవుతున్నట్లు టాక్. సేమ్‌టైమ్ సరైన టెస్టులు చేయకుండానే నెయ్యిని లడ్డూల తయారీకి వాడుతున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. సిట్ దర్యాప్తు ఆగిపోవడం.. సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి ఎంక్వైరీకి ఆదేశిస్తే లడ్డూ వివాదం మరో టర్న్ తీసుకోబోతుందన్న చర్చ జరుగుతోంది. సీబీఐ దర్యాప్తు చేస్తే కూడా సిట్ టీమ్ నుంచి ప్రాథమిక వివరాలను తీసుకుంటుంది. సిట్ ఒకవేళ ఎఫ్ఐఆర్ ఫైల్ చేస్తే అది సీబీఐకి బదిలీ చేయాల్సి ఉంటుంది. రెండ్రోజుల్లో సుప్రీంలో విచారణ ఉంది. ఒకవేళ కోర్టు ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగితే.. లడ్డూ వివాదంపై మరో లెవల్‌కు చేరుకోనుంది. నెయ్యి సరఫరా టెండర్లు దక్కింది ఏ సంస్థకు.. నెయ్యి సప్లై చేస్తుంది ఎవరు? కల్తీ జరిగితే జంతువుల ఫ్యాట్ కలిసింది నిజమా కాదా అనేది సీబీఐ దర్యాప్తులో తేలనుంది. అయితే సిట్ కంటే సీబీఐ దర్యాప్తులో అసలు విషయాలు బయటికి వస్తే.. అందరూ నమ్మే అవకాశం ఉంటుంది. సిట్ రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండటంతో కూటమి సర్కార్ ప్రభావితం చేసిందన్న ఆరోపణలు వచ్చే అవకాశం లేకపోలేదు. సీబీఐ ఎంక్వైరీలో అసలు బయటికి వస్తాయా.? దర్యాప్తులో నిజానిజాలు బయటికి వస్తే నెయ్యి వివాదం ఎవరి మెడకు చుట్టుకుంటుందనేది మాత్రం ఆసక్తికరంగా మారింది. వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున టీటీడీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క టీటీడీ చైర్మన్ మూడున్నర లక్షల టిక్కెట్లు తన కోటాలో మంజూరు చేశారని.. రోజా, పెద్దిరెడ్డి వేల కొద్దీ టిక్కెట్లు తీసుకుని అమ్ముకున్నారన్న టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఒకవేళ నెయ్యి కల్తీ కేసులో తీగలాగితే.. మిగతా విషయాలు కూడా బయటకు వస్తే కొందరు వైసీపీ నేతలు బద్నాం అవడం ఖాయమన్న చర్చ జరుగుతోంది. అందుకే సుప్రీంకోర్టు వ్యాఖ్యలతోనే అంతా అయిపోలేదని ముందు ముందు చాలా కథ ఉందని టీడీపీ నేతలంటున్నారు.

# 17.5 శాతానికి చేరిన నిరుద్యోగ రేటు

**గుంటూరు, అక్టోబరు 2, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతోంది. ఉద్యోగాలు లేక యువతీ, యువకులు అల్లాడిపోతున్నారు. డిగ్రీ, పీజీలు, ఇంజినీరింగ్, పీహెచ్‌డీలు వంటి ఉన్నత విద్యను పూర్తి చేసిన వారు సైతం నిరుద్యోగులుగా ఉన్నారు. కేవలం ఏపీ ఒక్కటే కాదు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ యువతీ, యువకుల పరిస్థితి దాదాపుగా ఇలానే ఉంది. ఈ పరిస్థితులను ఈ నెలలో లేబర్ బ్యూరో విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏపీలో యువత నిరుద్యోగ రేటు 17.5 శాతం నమోదు అయిందని పీఎల్ఎఫ్ఎస్ స్పష్టం చేసింది. అందులో పురుషులు నిరుద్యోగం 16.4 శాతమని, మహిళల నిరుద్యోగం 19.7 శాతం నమోదు అయిందని పేర్కొంది. దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువత (15-29 ఏళ్ల ) నిరుద్యోగాన్ని ఇది స్పష్టం చేసింది. నిరుద్యోగంలో దేశంలో ఏపీ పదో స్థానంలో నిలిచింది. స్త్రీ, పురుష మధ్య అంతరం తక్కువగా ఉన్నప్పటికీ, యువత నిరుద్యోగం మొత్తం అధిక రేటు రాష్ట్ర లేబర్ మార్కెట్‌లో నైపుణ్యాల అసమతుల్యతను స్పష్టం చేస్తోందని సర్వే తెలిపింది. లేబర్ బ్యూరో విడుదల చేసిన లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ కంటే లక్షద్వీప్ 36.2 శాతం, అండమాన్, నికోబర్ దీవులు 34 శాతం, కేరళ 30 శాతం, నాగాలాండ్ 27 శాతం, మణిపూర్ 23 శాతం, లడఖ్ 22 శాతం, అరుణాచల్‌ప్రదేశ్ 21 శాతం, గోవా 19 శాతం, పంజాబ్ 19 శాతం యువత నిరుద్యోగ రేటుతో ముందంజలో ఉన్నాయి. 2023 జులై నుంచి 2024 జూన్ వరకు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) భారతీయ లేబర్ మార్కెట్‌లో కొనసాగుతున్న సవాళు ్లను వెల్లడించింది. యువతలో లేబర్ మార్కెట్ మధ్య గణనీయమైన అంతరం కొనసాగుతోంది. ఆందళనకరంగా యువత నిరుద్యోగ రేటు 10.2 శాతం వద్ద ఉంది. అందులో పురుషులు నిరుద్యోగం 9.8 శాతం కాగా, మహిళల నిరుద్యోగలు 11 శాతంగా నమోదు అయింది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ద

యువతకు ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దానికనుగుణంగానే ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అయితే మరోవైపు ఉపాధి ఉన్న వాలంటీర్ల గురించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రంలో దాదాపు 2.60 లక్షల మంది యువత పరిస్థితి అగమ్యగోచరంగా తయరు అయింది. అలాగే బేవరేజ్ కార్పొరేషన్‌లో పని చేసే దాదాపు 20 వేల మంది ఉద్యోగులను అక్టోబర్ 1న నుంచి తొలగించారు. ప్రభుత్వ మద్యం షాపులను తొలగించడంతో వారు ఉపాధి కోల్పోయారు. రాష్ట్రంలోని యువత నిరుద్యోగం ఎక్కువ ఉండటంతో దాన్ని ఎదుర్కొవడం టీడీపీ కూటమి ప్రభుత్వానికి సవాల్‌గా మారింది.

# ఏపీపీఎస్సీ ఛైర్మన్ గా అనురాధ..

**విజయవాడ, అక్టోబరు 2, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాధ్యతల్ని రిటైర్డ్ పోలీస్ అధికారిణి ఏఆర్.అనురాధకు అప్పగించనున్నారు. ఏపీ క్యాడర్‌ల చైర్పర్సన్గా విశ్రాం త ఐపీఎస్ అధికారి ఏఆర్ అనురాధను ప్రభుత్వం నియమించనున్నట్టు సమాచారం. మరోవైపు మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, సంతోష్ మెహ్రా పేర్లు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఏఆర్ అనురాధ ఏపీలో ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందార. డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కూడా పనిచేశారు. 1987 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ అనురాధ భర్త నిమ్మగడ్డ సురేంద్రబాబు కూడా ఐపీఎస్ అధికారిఏపీపీఎస్సీ బాధ్యతలను అప్పగించే విషయంలో పలు పేర్లను పరిశీలించిన తర్వాత అనురాధ నియామకానికి ప్రభుత్వం మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఫైలును సిద్ధం చేసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించినట్టు ప్రచారం జరుగుతోంది. అనురాధ నియామకానికి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సుముఖత తెలపడంతో ఆమె నియామకం లాంఛనమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ ఆరోపించింది. గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని, తమకుకావాల్సిన వారికి మేలు చేసేందుకు ఒకటికి మూడు సార్లు మూల్యంకనం చేశారని టీడీపీ పలుమార్లు ఆరోపించింది. ప్రభుత్వం మారిన వెంటనే గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో ఏడాది పదవీ కాలం ఉన్నా సవాంగ్ ఏపీపీఎస్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత మూడు నెలలుగా ఏపీపీఎస్సీకి చైర్మన్ లేకుండా పోయింది. మరోవైపు కొత్త నోటిఫికేషన్లు ముందుకు కదలడం లేదు. ఇప్పటికే ప్రకటించిన పలు నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షలు నిలిచిపోయాయి. మరి కొన్ని పరీక్షల తేదీలు కూడా ప్రకటించలేదు. ఈ క్రమంలో ఏపీపీఎస్సీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఏపీపీఎస్సీ రేసులో పలువురి అధికారుల పేర్లు వినిపించాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుతో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్య, పోలా భాస్కర్ పేర్లు వినిపించాయి. కేరళలో పనిచేస్తున్న కె.శ్రీనివాస్, గతంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లో వైస్ చాన్సలర్ పనిచేసిన అప్పారావు, యలమంచిలి రామకృష్ణ పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. ఏపీపీఎస్సీ ప్రతిష్టను ఇనుమడింప చేయడం, పరీక్షల నిర్వహణ ఉద్యోగ నియామకాలు వివాదాలకు తావు లేకుండా చేపట్టే క్రమంలో ఏఆర్ అనురాధకు మొదటి ప్రాధాన్యం ఇచ్చినట్టు చెబుతున్నారు. మరోవైపు ఏపీపీఎస్సీ ఛైర్మన్ పదవి కోసం మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. 2019లో వైసీపీ అధికారంలోకి రాకముందు ఏపీ డీజీపీగా ఆర్పీ ఠాకూర్ ఉన్నారు. ఆయన స్థానంలో గౌతమ్ సవాంగ్‌ను నియమించారు. తాజాగా ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్పీ ఠాకూర్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన పేరును కూడా ఏపీపీఎస్సీ ఛైర్మన్ రేసులో పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ రేసులో ప్రముఖంగా వినిపిస్తున్న మరో పేరు సంతోష్ మెహ్రా.. వైసీపీ హయంలో వేధింపులకు గురైనట్టు గతంలో ఆయన ఆరోపించారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండే అధికారిగా మెహ్రాకు గుర్తింపు ఉంది

# చింతమనేని... కినుక...

**ఏలూరు, అక్టోబరు 2, పెన్ పవర్:** టీడీపీ సీనియర్ నేత ఫైర్ బ్రాండ్ లీడర్ చింతమనేని ప్రభాకర్ పేరు ఎక్కడా వినిపించలేదు. పార్టీ అధికారంలోకి వచ్చినా ఆయన కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. తాను గెలిచి, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చింతమనేని మౌనంగా ఉండటానికి గల కారణాలపై పార్టీలో నేతలు సయితం ఆఫ్ ది రికార్డుగా చర్చించుకుంటున్నారు. ఆయన దెందులూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. చింతమనేని ప్రభాకర్ ఇప్పటికి మూడుసార్లు దెందులూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ నేతగానే కొనసాగుతు?నారు. 2009లో వైఎస్ హవాలోనూ చింతమనేని గెలుపొందారు. తర్వాత 2014లో గెలిచి పార్టీ విప్ గా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వైసీపీ అభ్యర్థి అబ్బయ్య చౌదరి చేతిలో ఓటమి పాలయ్యారు. తిరిగి 2024 ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. చింతమనేని ప్రభాకర్ టీడీపీలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా గుర్తింపు పొందారు. అప్పట్లో తహసిల్దార్ వనజాక్షిపై దాడి చేసి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి కారణమయ్యారు. ఏలూరు జిల్లాలో చింతమనేని ప్రభాకర్ తెలుగుదేశం పార్టీకి బలమైన నేతగా గుర్తింపు పొందారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో ఆయన ఏ టీడీపీ నేత ఎదుర్కొనన్ని కేసులు ఎదుర్కొన్నారు. చింతమనేని ప్రభాకర్ జైలుకు కూడా వెళ్లి వచ్చారు. అలా గత ఐదేళ్లు అనేక కష్టాలు పడినా పసుపు జెండాను మాత్రం వదిలిపెట్టలేదు. అధికార పార్టీ బెదిరింపులకు తలొగ్గలేదు. రాజీకి రాలేదు. ఎన్ని కేసులనైనా ఎదుర్కొంటానని దైర్యంగా చెప్పిన నేత చింతమనేని ప్రభాకర్ మాత్రమేనని పార్టీలో అందరూ ఒప్పుకుంటారు. కానీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న పరిణామాలు చింతమనేని ప్రభాకర్‌ను బాధించాయయంటున్నారు. తనకు మంత్రి పదవి వస్తుందేమోనని ఆయన నమ్మారు. మూడు సార్లు గెలవడంతో పాటు పార్టీలో ఉన్నందున అనేక ఇబ్బందుల పాలయ్యానని, తనకు మంత్రి పదవిని ఈసారి ఇస్తారని ఆయన గట్టిగా విశ్వసించారు. అయితే కూటమి ప్రభుత్వం కేబినెట్ లో ఆయనకు చోటు దక్కలేదు. అయితే సామాజికవర్గాల సమీకరణల ఆధారంగానే చింతమనేని ప్రభాకర్‌కు కేబినెట్ లో చోటు దక్కలేదని, త్వరలోనే ఏదో ఒక కేబినెట్ ర్యాంకు పదవి ఇవ్వాలని చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు సమాచారం అందుతోంది. మరోవైపు ఏలూరు జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు కూడా చింతమనేని ప్రభాకర్‌ను బాధిస్తున్నాయంటున్నారు. ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావులను పార్టీలో చేర్చుకోవడంపై చింతమనేని ప్రభాకర్ కినుక వహించారని తెలిసింది. వైసీపీ అధికారంలో ఉండగా ఇద్దరూ చంద్రబాబుపైన, టీడీపీపైన విమర్శలు చేయడమే కాకుండా, తనపై కేసులు నమోదు కావడం వెనక కూడా వారు ఉన్నారన్న కారణంతో వాళ్ల రాకను విభేదిస్తున్నారు. కానీ దంపతులిద్దరూ లోకేష్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోవడంతో చింతమనేని ప్రభాకర్ కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. వాళ్ల వల్ల ఉపయోగం లేకపోయినా, కనీసం తమను సంప్రదించకుండా పార్టీలో చేర్చుకోవడంపై చింతమనేని కినుక వహిచారంటున్నారు.




# రెండు బైకులు ఢీ..ముగ్గురు మృతి



**ఖమ్మం పెన్ పవర్:** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలో రెండు ద్విచక్ర వాహనాలు ఘోరంగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకోగా తీవ్ర గాయాలైన మరో వ్యక్తిని వైద్యం కోసం తరలించారు.

కారేపల్లి మండలం గుట్ట కింద గుంపుకు చెందిన భార్యాభర్తలు సూర్యనారాయణ (58) సుగుణ (50).... మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న శ్రీకాకుళం కు చెందిన వెంకటేష్ (32) మృతి చెందారు. మృతుల్లో...వెంకటేష్ సింగరేణి సోలార్ ప్లాంట్ లో టెక్నీషియన్ గా పని చేస్తున్నాడు.. సూర్యనారాయణ మేషన్ వర్క్ చేస్తుంటాడు. ప్రమాదం జరిగిన వెంటనే తీవ్ర గాయాలతో ఉన్న ముగ్గురిని భద్రాద్రి జిల్లా ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే వారు మృతి చెందారు.... ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరొకరిని వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

## పక్షిలా విన్యాసం.. మతి పోగొడుతున్న పడిక్కల్ స్టన్నింగ్ క్యాచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ లో గ్రేట్ క్యాచులు అందుకోవడం ఒకప్పుడు అరుదుగా చూసేవాళ్ళం. కానీ టీ20 లీగ్ లు ఎక్కువైన తరుణంలో ఒక్క క్యాచ్ మ్యాచ్ ని డిసైడ్ చేసేస్తోంది. దీంతో బ్యాటింగ్, బౌలింగ్ మీదే కాదు ఫీల్డింగ్ మీద కూడా ప్లేయర్లు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమ్మశక్యం కానీ రీతిలో క్యాచులు అందుకుంటూ అభిమానులని థ్రిల్ కి గురి చేశారు. ఐపీఎల్, బిగ్ బాష్ లీగ్ లాంటి మెగా టోర్నీలే కాదు టెస్ట్ క్రికెట్ లోనూ గ్రేట్ క్యాచ్ లు అందుకొని ఔరా అనిపిస్తున్నారు.

ఒకదానికి మించి మరో క్యాచ్ ని అందుకుంటూ ఆడియన్స్ కి కిక్ ఇస్తోనే ఉన్నారు. తాజాగా అలాంటి క్యాచ్ ఒకటి ఇరానీ కప్ లో నమోదయింది. ముంబైతో జరుగుతున్న మ్యాచ్ లో రెస్టాఫ్ ఇండియా ప్లేయర్ దేవదత్ పడిక్కల్ స్లిప్ లో తీసుకున్న ఒక క్యాచ్ ఒకటి సంచలనంగా మారుతుంది. ముఖేశ్ కుమార్ బౌలింగ్ లో పృథ్వి షా డ్రైవ్ కు డిఫెన్స్ చేద్దామనుకుంటే బంతి ఎడ్జ్ అయ్యి సెకండ్ స్లిప్ కు దూరంగా వెళుతుంది. ఈ క్యాచ్ ను పడిక్కల్ ఫుల్ లెంగ్త్ డైవ్ చేసి ఒడిసిపట్టాడు. దాదాపు అసాధ్యమనుకున్న క్యాచ్ ను పట్టి ఆశ్చర్యానికి గురి చేశాడు. బ్యాటర్ పృథ్వి షా కాసేపు అలాగే షాక్ లో ఉండిపోయాడు.

%ూశ్రీంశీ =ఖుం% :- ఒంటిచేత్తో మ్యాచ్ గెలిపించిన దక్షిణాఫ్రికా స్టార్

ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న ముంబై ప్రస్తుతం రెండో రోజు టీ విరామ సమయానికి 6 వికెట్ల నష్టానికి 449 పరుగులు చేసింది. సర్ఫరాజ్ ఖాన్ (177) డబుల్ సెంచరీ దిశగా దూసుకెళ్తున్నాడు. అతనితో పాటు తనిష్ కొటియన్ (59) హాఫ్ సెంచరీతో క్రీజ్ లో ఉన్నాడు. కెప్టెన్ అజింక్య రహానే 97 పరుగులు చేసి తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. తొలి రోజు అయ్యర్ 57 పరుగులు చేసి రాణించాడు.

## టీమిండియాకు బిగ్ షాక్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి షమీ డౌట్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ వరల్డ్ కప్ తర్వాత భారత జట్టులో కనిపించలేదు. గాయం కారణంగా దాదాపు 10 నెలలపాటు క్రికెట్ కు దూరంగా ఉన్నాడు. షమీ న్యూజిలాండ్ సిరీస్ తో జరగబోయే టెస్ట్ సిరీస్ అందుబాటులో ఉంటాడనుకుంటే.. ప్రస్తుతం అనుమానంగా మారింది. ఈ టీమిండియా ఫాస్ట్ బౌలర్ కు మరోసారి గాయమైంది. అతనికి మోకాలి గాయం అయినట్టు నివేదికలు చెప్పుకొస్తున్నాయి. రంజీ ట్రోఫీలో మొదటి రౌండ్ లో ఆడదామనుకున్న షమీ.. అందుబాటులో ఉండే అవకాశం లేదు. అతను స్వదేశంలో జరగనున్న న్యూజిలాండ్ సిరీస్ కు దూరమవ్వడం ఖాయమైంది. రిపోర్ట్స్ ప్రకారం ఈ పేసర్ కు 6 నుంచి 8 వారాల రెస్ట్ అవసరమని తెలుస్తుంది. అంటే మరో రెండు నెలల పాటు అతను క్రికెట్ కు దూరంగా ఉండొచ్చు. నవంబర్ 22 నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ జరగనుంది. ప్రతిష్టాత్మమైన ఈ ట్రోఫీకి షమీ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుదీర్ఘ పర్యటనలో షమీ 100 శాతం ఫిట్ నెస్ సాధించడం కష్టం. దీంతో ఈ సిరీస్ కు భారత్ కు బిగ్ షాక్ తగలనుంది.

టెస్ట్ ఛాంపియన్ షిప్ కు కీలకమైన ఈ ట్రోఫీకి అనుభవజ్ఞుడు షమీ దూరమైతే భారమంతా సిరాజ్, బుమ్రాపై పడనుంది. భారత్ కు నాణ్యమైన మూడో పేసర్ లేదు. గతేడాది వరల్డ్ కప్ లో షమీ 24 వికెట్లు తీసి టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత మడమ గాయానికి గురయ్యాడు. ఫిబ్రవరి నెలలో ఎడమ చీలమండకు సర్జరీ చేయించుకున్నాడు. లండన్‌లోని ఓ హాస్పిటల్‌లో ఈ సర్జరీ నిర్వహించారు.

## మిల్లర్ ఎక్కడైనా కిల్లరే: ఒంటిచేత్తో మ్యాచ్ గెలిపించిన దక్షిణాఫ్రికా స్టార్





**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా స్టార్ ఫినిషర్ మిల్లర్ ప్రపంచంలో ఏ లీగ్ ఆడినా తనదైన ముద్ర వేస్తాడు. అంతర్జాతీయ క్రికెట్ లోనే కాకుండా ఇతర టీ20 లీగ్ ల్లో ఒంటి చేత్తో మ్యాచ్ లు గెలిపించడం అతనికి అలవాటే. తాజాగా కరేబియన్ ప్రీమియర్ లీగ్ లో ఒక్కడే తమ జట్టు బార్బడోస్ రాయల్స్ ను గెలిపించి క్వాలిఫయర్ 2 కు చేర్చాడు. భారత కాలమాన ప్రకారం బుధవారం ఉదయం జరిగిన ఈ మ్యాచ్ లో డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో ట్రినిబాగో నైట్ రైడర్స్ పై బార్బడోస్ రాయల్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 5 ఓవర్లకు 60 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బార్బడోస్.. మరో 4 బంతులు మిగిలి ఉండగానే 4.2 ఓవర్లలో మ్యాచ్ గెలిచింది. డేవిడ్ మిల్లర్ జట్టుకు విజయాన్ని అందించాడు. 60 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక్కడే 17 బంతుల్లో 50 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మిల్లర్ ఇన్నింగ్స్ లో 3 ఫోర్లతో పాటు.. 5 సిక్సర్లు ఉన్నాయి. తాను ఎదుర్కొన్న చివరి ఆరు బంతుల్లో ఏకంగా 27 పరుగులు చేయడం విశేషం. గతంలో ఎన్నో మ్యాచ్ ల్లో మిల్లర్ చివర్లో ఇలాంటి కీలక ఇన్నింగ్స్ లు ఆడి తమ జట్లకు ఊహించని విజయాన్ని అందించాడు. తాజాగా మరోసారి అతని ఇన్నింగ్స్ కు క్రికెట్ అభిమానాలు ఫిదా అయిపోతున్నారు.

%ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ట్రినిబాగో నైట్ రైడర్స్ 19.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. పూరన్ 60 బంతుల్లో 91 పరుగులు చేశాడు. ఈ దశలో ఫ్లడ్‌లైట్ లోపం కారణంగా ఆట రెండు గంటలకు పైగా నిలిచిపోయింది. దీంతో బార్బడోస్ లక్ష్యాన్ని 5 ఓవర్లకు 60 కు కుదించారు. క్వాలిఫయర్ 1లో గయానా అమెజాన్ వారియర్స్, సెయింట్ లూసియా కింగ్స్ మధ్య జరిగే మ్యాచ్‌లో ఓడిపోయిన జట్టుతో బార్బడోస్ రాయల్స్ తపడుతుంది.



జియా శంకర్ వార్డ్‌రోబ్ మిమ్మల్ని మంత్రముగ్ధుల ను చేస్తుంది

## నాల్గవ పెళ్లికి నటి పచ్చజెండా!




వనితా విజయ్ కుమార్... ఈ పేరు నెటీజన్స్ కు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఈమె పేరు చెప్పిన వెంటనే మూడు పెళ్ళిలు గుర్తుకు వస్తాయి. పెళ్లి ల మీద పెళ్ళిలు చేసుకున్న ఆమె ఆమధ్య మూడవ భర్తకు కూడా దూరం అయ్యింది. కొన్నాళ్ల క్రితం తాను సింగిల్ గా ఉన్నట్లుగా ఆమె ప్రకటించింది. అటుపై మళ్ళీ ఆమె పెళ్లి చేసుకోబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ ప్రచారం చాలా కాలంగా సాగుతోంది. తాజాగా వనితా విజయ్ కుమార్ ఆ ప్రచారాన్ని నిజం చేసింది. నాల్గవ పెళ్లి చేసుకుంటున్నట్లు ప్రకటించింది. తెలిసిన కొరియోగ్రాఫర్ తో మళ్లీ ఏడు అడుగులు వేస్తుంది. అక్టోబర్ 5న పెళ్లి ముహూర్తం కూడా పెట్టేసారు. మరి ఆ కోరియోగ్రాఫర్ ఎవరు? అంటే అతడు తెలిసినవాడే. రాబర్ట్ అనే కోరియోగ్రాఫర్ తో సహజీవనం చేస్తుందని నాలుగేళ్ల క్రితమే వార్తలొచ్చాయి. కానీ అదే సమయంలో ఫోటోగ్రాఫర్ పీటర్ పాల్ ని పెళ్లి చేసుకుంది. కానీ ఈ బంధం నాలుగు నెలలకే పరిమితమైంది. ఆ తర్వాత విడిపోయారు. కానీ పీటర్ తో పెళ్లి జరగలేదని..కేవలం నిశ్చితార్ధం మాత్రమే జరిగిందని అప్పట్లో వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది. తాజాగా మళ్లీ ఆ పాత రాబర్ట్ నే ఇప్పుడు నాల్గవ వివాహం చేసుకుంటుంది. వనిత వయసు ఇప్పుడు 43 ఏళ్లు. ఆమె కుమార్తె జోవిక బిగ్ బాస్ లోనూ పాల్గొంది. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది. 1995లో %-%చంద్రలేఖ%-% సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది. ఆ తర్వాత 2000 ఏడాదిలో నటుడు ఆకాష్ ని పెళ్లి చేసుకుంది. ఆ జంటకు కుమార్తె..కొడుకు ఉన్నారు. 2005లో విడిపోయారు. తర్వాత 2007 లో ఆనంద్ జయ దర్శన్ అనే వ్యాపార వేత్తని వివాహం చేసుకుంది. ఈ జోడీకి ఓ కుమార్తె ఉంది. ఈ జంట 2012 లో విడిపోయింది.



అనిఖా సురేంద్రన్ గ్లామరస్ లుక్స్ ప్రతిసారీ అద్భుతం

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com